# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 17-11-2023 15/-





## పాలస్తీనా చరిత్రలో మరో నెత్తుటి పుట






గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 46 హైదరాబాద్
శుక్రవారం 17 నవంబర్ 2023 రూ.15-00
2 జమాదిఉల్ ఊలా 1445 హిజ్రీ


**తొలిగీటు**

ఇష్టమైంది తినండి. నచ్చిన దుస్తులు ధరించండి. అయితే మీలో పొగరుగాని, అనవసరపు వ్యయం చేసే బుద్ధిగాని దరి చేసుకోకూడదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


28




## లోపల...


| | | |
|---|---|---|
| తప్పులెన్నువారు | ...... | 04 |
| పాలస్తీనా చరిత్రలో మరో నెత్తుటి పుట | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)–5 | ...... | 08 |
| చరితార్థులు–2 : దుదూమియాం | ...... | 11 |
| ఈ వారం ఫేక్‌న్యూస్ రౌండప్ | ...... | 12 |
| మానవ సృష్టి, అదృష్టం | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఇస్లామ్ ప్రవక్త (స) రాకకు పూర్వం అరేబియాలో బహుదైవారాధన | ...... | 20 |
| శ్రమించేవారినే అల్లాహ్ ప్రేమిస్తాడు | ...... | 23 |
| యుద్ధం అంతమవ్వాలి శాంతి పరిఢవిల్లాలి | ...... | 24 |
| కన్ను పేగు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| కేరళలో ఇస్లాం సంస్కృతిపై ప్రభుత్వ వెబ్‌సైట్ | ...... | 34 |


**ఓట్ల బిచ్చగాళ్ళు...**




ఓటరన్న వస్తున్నరు
ఓట్ల బిచ్చగాళ్ళు
ఐదేళ్ళకు ఒకసారి
వచ్చి పొయ్యెటోళ్ళు!
నువ్వేసే భిక్షతోనే
గద్దెను ఎక్కెటోళ్ళు
మళ్ళా ఐదేళ్ళదాక
మొఖం చూపనోళ్ళు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## తప్పులెన్నువారు

బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుటుంబ నియంత్రణ గురించి మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలపై గగ్గోలు చెలరేగింది. ఆయన సెక్స్ ఎడ్యుకేషన్ గురించి మాట్లాడారని ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ అన్నారు. బీజేపీ నేతలు ఇప్పుడు నితీష్ కుమార్ వ్యాఖ్యలపై గగ్గోలు చేస్తున్నారు. కాని దేశంలో చాలా మంది గ్రామీణ నిరుపేద మహిళలకు గర్భనిరోధ సాధనాలు అందుబాటులో లేవన్నది కూడా అంతే నిజం. కాని నితీష్ కుమార్ వ్యాఖ్యలపై స్వయంగా ప్రధాని కూడా దండెత్తారు. ఇంకెంత దిగజారిపోతారు, ఇండియా కూటమి నేతలు ఇంకెంత దిగజారిపోతారంటూ ధ్వజమెత్తారు.

నితీష్ కుమార్ వ్యాఖ్యల్లో ఔచిత్యం గురించింది వేరే చర్చ. ఆయన లేవనెత్తిన సమస్య తీవ్రమైందా కాదా అన్నది వేరే చర్చ. కాని ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు.

నితీష్ కుమార్ వ్యాఖ్యలు అసభ్యంగా ఉన్నాయని దాడులు చేస్తున్న బీజేపీ నేతలు బీజేపీ ప్రముఖ నాయకుడు నిశికాంత్ దూబే తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రాను నగరవధు అని తిట్టిన విషయం మరిచిపోయారా? నగరవధు అనే మాటకు అర్ధమేమిటి? వాడ వదిన అనే తెలుగు మాటకున్న అర్ధమే కదా. ఇంతకన్న విడమర్చి ఈ మాటలకు అర్థాలు చర్చించడం మర్యాదను అతిక్రమించడమే అవుతుంది. కాని ఇలాంటి మాటలు నిజానికి నితీష్ కుమార్ చేసిన వ్యాఖ్యల కన్నా తీవ్రమైనవి కావా? అప్పుడు ఈ నీతులు చెప్పేవారు ఎవరైనా నిశికాంత్ దూబేకు నీతులు చెప్పారా? సోనియా గాంధీని కాంగ్రెస్ కి విధవా అని పిలిచినవారిని ఏమనాలి?

ఢిల్లీ వీధుల్లో మన మహిళా మల్లయోధులు లైంగిక వేధింపులపై నిరసనలు తెలిపిన సంఘటనలు గుర్తున్నాయా? బ్రిజ్ భూషన్ సింగ్ మహిళా క్రీడాకారిణులను లైంగికంగా వేధించడానికి ఎలాంటి అవకాశమూ వదిలేవాడు కాదని పోలీసులు కూడా చెప్పలేదా? ఈ విషయంలో ప్రధాని నోరిప్పారా? బీజేపీ నేతలెవరైనా నోరిప్పారా?

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటన తర్వాత బీజేపీ నేతలెంతమంది నోరిప్పారు? మహిళలను గౌరవిస్తున్న మహా సంస్కారవంతులుగా ముందుకు వస్తున్న వాళ్ళు తమ పార్టీ విషయమై ఎందుకు నోరిప్పరు?

నితీష్ కుమార్ వ్యాఖ్యలు పురుషాహంకార వ్యాఖ్యలుగా విమర్శిస్తున్నవారు గతంలో తమ పార్టీ నేతలు చెప్పిన అనేక మాటలపై మౌనం వహించినవారే.

మౌనం అనేది అనేక విషయాల్లోను మన ముందుకు వస్తోంది. ఇటీవల డెహ్రాడూన్‌లో ఒక కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో భాగేశ్వర్ థామ్ బాబా ధీరేంద్రశాస్త్రితో పాటు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిములపై, క్రయిస్తవులపై విద్వేష వ్యాఖ్యలు బాహాటంగా చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి తలవంపులు తెచ్చే సంఘటన కాదా? ఇది మొదటి సంఘటన కూడా కాదు. ధర్మసంసద్‌లలో ఇలాంటి విద్వేషం బాహాటంగా వినిపించింది. పురుషాహంకారపు వ్యాఖ్యలు ఎవరైనా చేయడం ఎంత తప్పో, ఒక మతాన్ని, కులాన్ని కించపరుస్తూ ఎవరైనా మాట్లాడినా అంతే తప్పు. ఇలాంటి వ్యాఖ్యలపై మీడియా నోరెత్తడం లేదు ఎందుకని?

ఏది ఏమైనా నితీష్ కుమార్ చేసిన వ్యాఖ్యల్లో తప్పు ఉంటే తప్పక నిందించవలసిందే. తప్పక నిలదీయవలసిందే. తప్పక ఖండించవలసిందే. కాని అదే విధంగా పురుషాహంకారంతో మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యానించే ప్రతి నాయకుడిని నిలదీయాలి. నగర వధు లాంటి వ్యాఖ్యలు చేసేవారు, ఇంట్లోపోయి అంట్లు తోముకో రాజకీయాలెందుకు అంటూ వ్యాఖ్యలు చేసినవారు ఏ పార్టీ వాళ్ళయినా వారిని కూడా ఖండించాలి. అలాగే మత దురుహంకారం ప్రదర్శిస్తూ ఒక సముదాయాన్ని వెలివేస్తున్నామని ప్రకటనలు చేసేవారు, ఒక సముదాయంపై విద్వేష వ్యాఖ్యలు చేసేవారందరినీ ఖండించాలి. మీడియాలో ఇప్పుడు నితీష్ కుమార్ వ్యాఖ్యలపై గగ్గోలు చేస్తున్న యాంకర్లు, నేతలు ఇలాగే వ్యవహరిస్తున్నారా? ప్రతిసారి తప్పును నిలదీస్తున్నారా? లేక తమ స్వంత వారి విషయంలో కళ్ళుమూసుకుంటున్నారా? ప్రజలే ఆలోచించాలి. ✤

అబ్దుల్ వాహెద్



# పాలస్తీనా చరిత్రలో మరో నెత్తుటి పుట

**గాజాలో** ఇస్రాయీల్ ఆపరేషను బహుశా పూర్తయిపోయిందన్న సంకేతాలు అందుతున్నాయి. గాజాలో నెతన్యాహు దురాక్రమించుకోవాలనుకున్న భూభాగాన్ని ఆక్రమించుకున్నాడు. ఎంత నరమేధం చేయాలో అంత నరమేధం జరిపేశాడు. ఇటీవల జరిగిన సంఘటనలనే చూద్దాం.

ఇజ్రాయెల్ దళాలు గాజాలోకి చొచ్చుకుపోయాయి. అమెరికా ఇచ్చిన ఆయుధబలం, అండదండలు పుష్కలంగా ఉన్న ఇస్రాయీల్ దళాలు అక్కడ చొచ్చుకుపోవడంలో ఆశ్చర్యము లేదు. ఈ దాడుల్లో పాలస్తీనీయుల మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాలస్తీనా మరణాల సంఖ్య తాజా అంచనాల ప్రకారం 10,000 దాటింది. U.S. సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ మానవీయ కాల్పుల విరమణకు ఇచ్చిన పిలుపును ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తిరస్కరించాడు. ఐక్యరాజ్య సమితి ప్రతినిధులకు ఇస్రాయీల్ వీసాలు కూడా నిరాకరించింది. అస్సలు గాజాలో మానవ సంక్షోభం ఏదీ లేదని నెతన్యాహు ప్రకటించేశాడు. హమాస్ బంధీలను విడుదల చేయకపోతే సైనిక కార్యకలాపాలలో విరామం ఇచ్చేది లేదన్నాడు. హమాస్ అయితే బంధీలను విడుదల చేయలేదు. చనిపోయిన 10 వేల మందిలో చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పాశ్చాత్య చానళ్ళతో సహా ఇక్కడి ...పోయా న్నట్లు ప్రచారం మొదలుపెట్టాయి. ఏది ఏమైనా ఇస్రాయీల్ సైనికచర్యతో చంపింది పిల్లలను, ఆసుపత్రుల్లోని రోగులను, మహిళలను, వృద్ధులనే, సాధారణ ప్రజలనే అన్నది ఇప్పుడు యావత్తు ప్రపంచం కాదనలేని సత్యం. హమాస్ ఇస్రాయీల్ పై దాడి చేసింది. ఇస్రాయీల్ దాడిలో చనిపోయింది పాలస్తీనా సాధారణ ప్రజలు. హమాస్‌కు ఎంత నష్టం వాటిల్లిందో చెప్పగలిగిన పరిస్థితి ఎక్కడా కనబడడం లేదు. ఇజ్రాయెల్ గాజాపై ముఖ్యంగా గాజా నగరం చుట్టూ వైమానిక దాడులు నిరంతరం చేసింది. నవంబర్ 3, 2023న తేదీన గాజా నగరంపై కొనసాగుతున్న వైమానిక బాంబు దాడుల కారణంగా ఇజ్రాయెల్‌లో పనిచేస్తున్న సుమారు 3,000 మంది పాలస్తీనియన్ల జీవనోపాధి దెబ్బతిన్నది. నవంబర్ 4న గాజా నగరానికి సమీపంలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు వరుసగా రెండో రోజు కూడా జరిగాయి. ఈ శిబిరం గాజాలో అతిపెద్ద శరణార్థుల శిబిరం. అంతకుముందు రోజు, మంగళవారం నాడు జరిగిన వైమానిక దాడిలో కనీసం 50 మంది పాలస్తీనియన్లు మరణించారు, 150 మందికి పైగా గాయపడ్డారు. గాజాలో తీవ్రమైన మానవీయ సంక్షోభం నెలకొంది. ఈ శిబిరంలోని ఉగ్రవాద కమాండర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొంది. పాలస్తీనా సాధారణ ప్రజలు మరణించారని హమాస్ పేర్కొంది. దాడి తర్వాత

సహాయ సిబ్బంది శిథిలాల నుంచి బాధితులను, మృతదేహాలను వెలికి తీస్తున్న భయంకర దృశ్యాలు ప్రపంచం చూసింది. జబాలియా శరణార్థి శిబిరంపై భారీ వైమానిక దాడులు ఇజ్రాయెల్ హమాస్ యుద్ధంలో తలెత్తిన తీవ్రమైన మానవీయ సంక్షోభాన్ని చాటి చెబుతున్నాయి. ఈ దాడులపై అంతర్జాతీయంగా కూడా ప్రతిస్పందన వినిపించింది. గాజాలోని షాతీ శరణార్థుల శిబిరం (దీనిని బీచ్ క్యాంప్ అని కూడా పిలుస్తారు) పై జరిగిన దాడిలో 500 మంది పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు 2,700 మంది గాయపడ్డారు. ఈ దాడులు పాలస్తీనా సాధారణ ప్రజలపై జరుగుతున్న అమానుష దాడులకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. కాగా ఇస్రాయీల్ ఈ దాడులను సమర్థించుకోడానికి హమాస్ పౌరులను మానవ కవచాలుగా వాడుతుందన్న వాదన వినిపిస్తోంది. హమాస్ జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో సైనికసామాగ్రి, ఆయుధాలు దాచిపెడుతుందని, ఆ విధంగా మహిళలు, పిల్లలతో సహా పౌరులను మానవ కవచాలుగా ఉపయోగిస్తుందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఈ ఆరోపణల ద్వారా సాధారణ ప్రజలను చంపడాన్ని సమర్థించుకుంటూ వస్తోంది. హమాస్ పౌరులను మానవ కవచాలుగా ఉపయోగిస్తుందనే వాదనపై అనేక సందేహాలు వినిపిస్తున్నాయి. అనేక విమర్శలు వస్తున్నాయి. ఇజ్రాయెల్ వాదనలో ప్రధానమైన లోపాలేమిటంటే, ఇస్రాయీల్ చెబుతున్నట్లు హమాస్ పౌరులను మానవకవచాలుగా ఉపయోగిస్తున్నట్లు ఆధారాలు లేవు. యుద్ధప్రాంతంలో పరిశీలకులు ప్రవేశించే అనుమతులు లేవు. కాబట్టి ఈ వాదనను ధృవీకరించడం సాధ్యం కాదు. ఈ ధృవీకరణ లేకుండా ఇస్రాయీల్ చెబుతున్న మాటలను నమ్మలేం. రెండవ కారణం, ఇస్రాయీల్ అత్యధిక బలప్రయోగానికి పూనుకుంటోంది. హమాస్ పౌరులను మానవ కవచాలుగా ఉపయోగిస్తుందా లేదా అన్నది పక్కన పెట్టినా, ఇజ్రాయెల్ బలప్రయోగం అత్యధిక స్థాయిలో ఉంది. ఇలాంటి సైనికచర్యల్లో సాధారణ పౌరులు అత్యధికంగా మరణిస్తారని నిపుణులు వాదిస్తున్నారు. అంతర్జాతీయ చట్టం సైనికచర్యల్లో బలప్రయోగం పరిమితికి మించడం కుదరదు. కాని ఇస్రాయీల్ గాజాలో చేస్తున్నది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అంటున్నారు పరిశీలకులు. అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం యుద్ధం చేస్తున్న సైనికులు, సాధారణ పౌరుల మధ్య తేడాను సైనికదళాలు గుర్తించాలి. ఇజ్రాయెల్ ఈ సూత్రాన్ని పాటించడంలో విఫలమైందని, ఫలితంగా పౌరులు మరణించారని విమర్శకులు పేర్కొన్నారు. పౌరమరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఇస్రాయీల్ వైఫల్యాన్ని, అంతర్జాతీయ చట్టాల పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. పౌర ప్రాణనష్టాలకు జవాబుదారీతనం లేకపోవడం కూడా ఈ యుద్ధంలో కనబడుతుంది. ఈ జవాబుదారీతనం లేకపోవడం వల్ల ఇజ్రాయెల్ వాదనలకు చట్టబద్ధత లేదని, ఇస్రాయీల్ వాదనలో డొల్లతనాన్ని ఇవి సూచిస్తున్నాయని చాలా మంది వాదిస్తున్నారు. కాగా మరోవైపు ఇజ్రాయెల్ భూ బలగాలు ఉత్తర గాజాలో కార్యకలాపాలను కొనసాగించాయి. నవంబర్ 3న వైద్యసహాయ బృందంపై జరిగిన దాడిలో కనీసం 15 మంది పాలస్తీనియన్లు మరణించారు. UN సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. నవంబర్ 3న పాఠశాలలపై, ఆసుపత్రులపై జరిగిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. ఇస్రాయీల్ దాడుల్లో సాధారణ పౌరులు ఎలా లక్ష్యమవుతున్నారో ఈ దాడులు చెబుతున్నాయి. కనీసం ఆరోగ్యవైద్య బృందాలను కూడా వదలకుండా దాడులు చేయడం జరుగుతోంది. మరోవైపు US విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ టెల్ అవీవ్ మూడవసారి పర్యటించారు. నవంబర్ 3న ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో సమావేశమయ్యారు. జోర్డాన్‌లో అరబ్ నాయకులతో బ్లింకెన్ కాల్పుల విరమణ గురించి చర్చించబోతున్నారు. నవంబర్ 3న హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రుల్లా పాలస్తీనా గురించి మాట్లాడారు. US ప్రమేయాన్ని విమర్శించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆయన చేసిన తన మొదటి ప్రసంగంలో అక్టోబర్ 7న జరిగిన హమాస్ దాడిని ప్రశంసించారు. హిజ్బుల్లా వైఖరి ఈ ప్రాంతంలో మరింత జటిలసమస్యలకు దారితీస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు ఇజ్రాయెల్ దళాలు వెస్ట్ బ్యాంక్‌పై దాడులు ప్రారంభించింది. కనీసం 41 మంది పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకున్నారు. నబ్లస్, జెనిన్, హెబ్రాన్, బెత్లెహెం వంటి పట్టణాలలో 143 మంది కంటే ఎక్కువ మంది పాలస్తీనీయులు మరణించారు. ఏది ఏమైనా ఇప్పుడు పాలస్తీనా తీవ్రమైన మానవ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నది ఎవ్వరు కాదనలేని వాస్తవం.

అక్టోబర్ 7వ తేదీన జరిగిన హమాస్ దాడి తర్వాత అనేకమంది ఇస్రాయీల్ పౌరుల్ని హమాస్ బంధీలుగా చేసిందనే వార్త వచ్చింది. ఇంతమంది ఇస్రాయీల్ పౌరులు హమాస్ వద్ద బంధీలుగా ఉంటే ఇస్రాయీల్ సైన్యం గాజాలో ప్రవేశించి బంధీల ప్రాణాలకు ముప్పు తెస్తుందా? అనే ప్రశ్న వచ్చింది. కాని ఇస్రాయీల్ గాజాపై దాడి చేసింది. పిల్లలు, మహిళలను, వృద్ధులు రోగుల్ని చంపింది. చివరకు ఐక్యరాజ్యసమితికి చెందిన వారు కూడా చనిపోయారు.

అమెరికా ఇస్రాయీల్‌కు మద్దతిస్తుందని చాలా మంది భావిస్తారు. కాని తాజా సంఘటనల తర్వాత అర్థమవుతున్నదేమిటంటే, నెతన్యాహు ఆదేశిస్తే జో బైడెన్ పాటిస్తారని స్పష్టమయ్యింది. ఇప్పుడు అమెరికాలో దౌత్యవేత్తలు కొందరు అమెరికా ప్రభుత్వ వైఖరిపై అసమ్మతి ప్రకటిస్తూ లేఖ రాశారని తెలుస్తోంది. ఇప్పుడు నెతన్యాహు గాజాలో సగం ప్రాంతాన్ని ఆక్రమించుకునే ప్లాను సిద్ధం చేసుకున్నాడు. నెతన్యాహు ఇటీవల

చేసిన ప్రకటన ఏమిటంటే గాజా రక్షణ బాధ్యత అనిశ్చిత కాలం వరకు ఇస్రాయీల్ తీసుకుంటుందన్నాడు. రక్షణ బాధ్యత అంటే ఇక్కడ మనం గాజాలోని పాలస్తీనా ప్రజలపై దౌర్జన్యాలు చేసే హక్కుగా అర్థం చేసుకోవాలి. ఉత్తర గాజాపై బాంబుల వర్షం కురిపించి అక్కడి ప్రజలను దక్షిణ గాజావైపు నెట్టేసి ఇప్పుడు పూర్తి ఉత్తరగాజాను తన వశం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇప్పుడు గాజాలోని 70 శాతం జనాభా నిరాశ్రయులయ్యారు. ఇప్పుడు ఉత్తరగాజాను తన గుప్పిట పెట్టుకోవాలని భావిస్తోంది. అంటే అక్కడ సెటిల్మెంట్ల నిర్మాణం మొదలెడతారు. ఇలాగే పాలస్తీనా భూభాగాలను ఇస్రాయీల్ కబళించిందన్నది చరిత్ర చదివితే అర్థం అవుతుంది.

గమనించవలసిందేమిటంటే, ఇంతకు ముందు కూడా గాజాపై ఇస్రాయీల్ దురాక్రమణ చేసింది. ఆ తర్వాత ఒక ఒప్పందం వల్ల గాజా నుంచి ఇస్రాయీల్ వైదొలగవలసి వచ్చింది. ఇప్పుడు ఆ పని మళ్ళీ చేసింది. పాలస్తీనాలో జరుగుతూ వస్తున్నది ఇదే. పాలస్తీనాలోని మిలిటెంట్లు ఇస్రాయీల్‌పై దాడి చేస్తారు. ఇస్రాయీల్ ప్రతిదాడి పేరుతో పాలస్తీనా సాధారణ ప్రజలపై దాడులు చేస్తుంది. ఈ క్రమంలో పాలస్తీనా భూభాగాలు కబళిస్తుంది. తర్వాత అమెరికా శాంతిచర్చలంటూ ముందుకు వస్తుంది. దురాక్రమించిన భూభాగాలను ఇస్రాయీల్ వదిలిపెట్టడం జరగదు. పాలస్తీనాలో మిలిటెన్సీ తగ్గుముఖం పట్టడం కూడా జరగదు. ఇప్పుడు పాలస్తీనా అధ్యక్షుడిపై దాడి జరిగింది. పాలస్తీనా ప్రజల్లో ఆయన పట్ల తీవ్రమైన ఆగ్రహం ఉంది. ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమిటంటే పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా చెబుతారు. ఇస్రాయీల్ సృష్టించిన మిలిటెన్సీగా చెబుతారు. నిజానికి భారతదేశం ఇంతవరకు హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించలేదు. కాని పాలస్తీనా అధ్యక్షుడు హమాస్ విషయంలో ఇలాంటి మాటలు చాలా సార్లు చెప్పారు.

ఇక్కడ గమనించవలసిన మరో విషయం ఏమిటంటే, అల్ అక్సా మస్జిదుపై ఇస్రాయీల్ దళాలు దాడులు చేయడం హమాస్ దాడికి ముందు నుంచే జరుగుతోంది. ఇప్పుడు కూడా మళ్ళీ జరిగింది. అల్ అక్సా వెస్ట్ బ్యాంకులో ఉంది. గమనించవలసిన మరో విషయమేమిటంటే గాజాపై ఇస్రాయీల్ ఇంత భయంకరమైన దాడులు చేస్తున్నా హమాస్ ఎలాంటి ప్రతి దాడి చేసిన దాఖలా లేదు. అలాగే ఇస్రాయీల్ బంధీలను హమాస్ ఏం చేసిందన్న వివరాలేవీ రాలేదు. ఇస్రాయీల్ కూడా బంధీల విషయంలో భయపడుతున్న దాఖలా లేదు. హమాస్ ఏం చేస్తున్నట్లు? గాజాపై దాడి చేసే అవకాశాన్ని ఇస్రాయీల్‌కు ఇచ్చి ఊరుకోవడమే హమాస్ పనా? ఈ పరిస్థితులు హమాస్ పై అనుమానాలను పెంచుతున్నాయి. ఇస్రాయీల్ కోసం పనిచేస్తుందా? అనే ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు హమాస్ బంధీల గురించి తమకేమీ తెలియదని చెబుతోంది. మరోవైపు హిజ్బుల్లా ఇస్రాయీల్‌తో తలపడుతున్న వార్తలు వస్తున్నాయి. కాని హమాస్ నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేదు. హమాస్ చేసిన దాడులకు సంబంధించిన వార్తలు ప్రపంచానికి తెలియడం లేదా? వార్తలు సెన్సార్ అవుతున్నాయా?

కాని ఒకటి వాస్తవం. ఇస్రాయీల్ ప్రధాని నెతన్యాహు కోరినట్లే అంతా జరిగింది. దేశంలో అవినీతి ఆరోపణలతో రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడిన నెతన్యాహు ఇప్పుడు గాజా భూమిని ఆక్రమించుకోవడం ద్వారా హీరో అయిపోయే అవకాశం దొరికింది. అమెరికా దాదాపు 50వేల కోట్లకు పైగా విలువైన ఆయుధాలు ఈ క్రమంలో అమెరికా ఇస్రాయీల్ కు అమ్మింది.

ఏది ఏమైనా పాలస్తీనాలో ఇస్రాయీల్ దురాక్రమణల పరంపర కొనసాగుతూనే ఉంది. పాశ్చాత్యదేశాలు ఇస్రాయీల్‌కు మద్దతివ్వడం కొనసాగుతూనే ఉంది. పాశ్చాత్యదేశాల్లో ఈ యుద్ధం తర్వాత తలెత్తిన ప్రజాభిప్రాయం కూడా కొంతకాలానికి చల్లారిపోతుంది. కాని అన్యాయాల దురాక్రమణల పర్వం ఎంత కాలం కొనసాగుతుందన్నది తెలియదు. ✤

## నమ్మినా నమ్మకపోయినా? 10

## దార్శనిక జీవితం

ఉత్తమంగా ఆలోచించి భావి జీవితానికి మంచి ప్రణాళికలు నిర్మించటం మనిషికి అన్ని విధాల శ్రేయోదాయకం. దానికి గాను మనిషి తనను సృష్టించిన సృష్టికర్తను నమ్మాలి. ఆయన మనల్ని అన్నివేళలా గమనిస్తూనే ఉన్నాడు. మానవుడు తన సృష్టికర్తను నమ్మి, ప్రవక్తల ద్వారా పంపిన ఆదేశాలను, ఆజ్ఞలను పాటిస్తూ, పాలిస్తూ వాటి ప్రకారం తన జీవనాన్ని కొనసాగిస్తే ఈ లోకంలో ఇంకా మరణానంతర జీవితంలో కూడా సఫలీకృతుడవుతాడు. ఈ దైవాజ్ఞలే సత్యాసత్యాలను వేరుపరచి మనకు చేదోడుగా నిలుస్తాయి. తనను నిత్యం గమనించే వాడొకడు ఉన్నాడని విశ్వసించి, మరణానంతరం దేవుని న్యాయస్థానంలో జవాబు చెప్పుకోవాలనే ఆలోచనతో జీవిస్తే పరలోకంలో మనిషి శాశ్వత స్వర్గసుఖాలకు నోచుకుంటాడు. లేకపోతే శిక్షాపాత్రుడవుతాడు. కాబట్టి తనను తాను ఎలా మలచుకోవాలో ప్రతి మనిషీ ఆలోచించుకోవాలి.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

అధ్యాయం -2

5

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## 3. అనుపమ త్యాగం!

మక్కా విజయం, కాబా ప్రక్షాళనం జరగటం ముస్లిముల ఘనత కాదు, ఇది ఇస్లామ్‌లోని సత్యత! ఈ సత్యాన్ని గ్రహించిన అరేబియా తెగలు ఇస్లామ్ స్వీకరించి ప్రవక్త శ్రీ (స) దైవ దౌత్యాన్ని విశ్వసించాయి. అయితే కొన్ని తెగలు ముస్లిముల పట్ల ద్వేషం, ఈర్ష్య, విరోధం కారణంగా తమ మంటను దాచుకోలేకపోయాయి. వీరిలో హవాజిన్, సకీఫ్ తెగలు మున్ముందున్నాయి. వీరు ధైర్య వంతులు, శౌర్యవంతులు, యుద్ధం తర్ఫీదు పొందినవారు.

## హునైన్ లోయలో

ఈ తెగల ప్రజలు మక్కా పైన ముస్లిముల అదుపును గురించి తెలుసుకుని, హవాజిన్‌కు చెందిన ఓ యువకుడు, మాలిక్ బిన్ ఔఫ్‌ని తమ సేనాపతిగా ఎన్నుకుని ముస్లిముల నుంచి మక్కా, మదీనా తిరిగి చేజిక్కించుకోవాలని సన్నాహాలు చేయ సాగారు.

ఈ సమాచారం ఎప్పటిలా ప్రవక్త మహనీయులకు ముందే తెలిసిపోయింది. ఆయన పన్నెండు వేల మంది యోధులతో హవాజిన్ వైపునకు బయల్దేరారు. హవాజిన్ సేనాని మాలిక్ కూడా తన గూఢాచారుల ద్వారా ప్రవక్త శ్రీ అనుసరించే మార్గం గురించి తెలుసుకుని హునైన్ లోయలో సిపాయీలను చెట్ల మధ్య గోప్యంగా నియమించాడు.

ఉదయం పూట మసక బారిన వెలుగులో అతి వేగంగా వస్తున్న ముస్లిముల పైన వారు దాడి జరిపారు. అయితే మహనీయ అబూ బక్ర్(ర)తోపాటు కొందరు త్యాగధనులయిన సహ చరులు ప్రవక్త శ్రీ చుట్టూ రక్షణ కవచంగా ఏర్పడ్డారు. అప్పుడు జనం బిత్తరపోయి పారిపోతూ ఉంటే అబూ బక్ర్ (ర) ఆ శత్రువుల ఓ నాయకుడు జుల్ ఖుమార్‌ని సంహరించారు. ఆ సందర్భంలోనే ముస్లిములు శత్రువు పైకి తిరుగు దాడి చేయగా హవాజిన్ వారి మిత్ర తెగలు, అందరూ అంతా వదలి పారిపోయారు.

చుట్టుప్రక్కల నున్న పాలకులతో సత్సంబంధాలు పెంపొం దించుకునేందుకు ప్రవక్త శ్రీ(స) హిజ్రీ ఏడవ సంవత్సరం చివరన తన సుహృద్భావ సందేశాన్ని అందరికీ పంపించారు. రోమను చక్రవర్తి ఈ రాయబారుల నందరినీ చంపించాడు. ఇక ప్రయో జనం లేదని హిజ్రీ ఎనిమిదవ సంవత్సరం, ప్రవక్త మహ నీయులు (స) మూడు వేల ముస్లిమ్ యోధుల్ని క్రైస్తవ సేనను ఎదుర్కొనడానికి పంపారు. మూతా అనే చోటికి చేరేసరికి బస్రా పాలకుడు ఒక లక్ష సేనతో మార్కొన్నాడు. కొన్ని గంటల పోరు తరువాత దైవ కృపవల్ల ముస్లిమ్ యోధులకు చెప్పుకోదగ్గ నష్టం ఏదీ జరగ లేదు, క్రైస్తవ సిపాయీలు పెద్ద సంఖ్యలో హతమయ్యారు.

మూతాలో సంభవించిన ఈ పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేం

దుకు మరుసటి సంవత్సరం రోమను చక్రవర్తి హెరాక్లియస్ తన సామంతుడు, గస్సాన్ పాలకుని ద్వారా సరిహద్దుల పైన తబూక్ అనే చోట పెద్ద సంఖ్యలో సేనను మోహరింప జేశాడు. ప్రవక్త శ్రీకి ఈ సమాచారమంతా ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంది. ఆ సందర్భంలో ఆయన ముస్లిములకు విరాళాల కొరకు గమనిక పంపారు, దానికి స్పందించి ప్రతి నిరుపేద వాడయినా, శ్రీమంతుడయినా తనకు సాధ్యమయినదంతా తెచ్చి ప్రభుత్వ ఖజానాలో జమ చేయసాగాడు.

## తబూక్ పయనం

మహనీయ ఉమర్(ర) తనకున్న దానంతటిలో సగభాగం సమర్పించారు. మహనీయ అబూ బక్ర్ వంతు వచ్చినప్పుడు, ఆయన, రొక్కం, ఆయుధాలే కాక విసుర్రాయి, చాప, నీళ్లు త్రాగే పాత్ర, ఇంకా ఇంట నున్న చిన్న పెద్ద, సామానులతో సహా సర్వం అప్పటి అవసరార్థం తెచ్చి జమ చేశారు. అప్పుడు ప్రవక్త మహనీయులు అడిగారు, “ అబూ బక్ర్, ఇంటి వారల కోసం ఏమన్నా వదలి వచ్చావా లేదా?” అని. సమాధానంగా ఆ మహనీయుడు, “ దైవం, దైవ ప్రవక్త మటుకే చాలు వారి కొరకు!” అన్నారు.

## ఇదీ ఆయన త్యాగశీలత!

ఆయన నాయకత్వంలో హి॥జీ 9వ సంవత్సరం ముస్లిముల నిర్వహణలో తొలి హజ్జ్ జరిగింది. కాబా గృహం, రెండున్నర వేల సంవత్సరాల క్రితం ప్రవక్తల పితామహుడు మహనీయ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్, ఆయన సౌశీల్యు డయిన పుత్రుడు మహనీయ ఇస్మాయీల్ అలైహిస్సలామ్ కలసి దైవాదేశం మేరకు, ఒక్కడే అయిన సృష్టికర్త, దేవుని ఆరాధన కొరకు నిర్మించిన ప్రప్రథమ దైవ గృహం.

ఈ ఆరాధనాలయంలో చాలా కాలం వరకు, ఒకే దేవుని ఆరాధన జరుగుతూ వచ్చింది, కాని క్రమేణ అనేకమంది బూటకపు దైవాలను కల్పించుకుని అందులోనే వాటినీ పూజించసాగారు జనం! కడకు అదొక విగ్రహారాధన కేంద్రంగా రూపొందింది.

అప్పటికి ఒక సంవత్సరం మునుపే, ప్రవక్త మహనీయులు (స) మక్కా విజయం సందర్భంలో, రమజాన్ 20న, ఆయన దైవ గృహంలోని విగ్రహాలను అక్కడి నుండి తుడిచి పారవేసి కాబాను పరిశుద్ధ పరిచారు. అప్పుడు అరేబియాలోని అత్యధిక మంది ముస్లిములయ్యారు. ఇక మిగిలిపోయిన వారికి, ఆ మహనీయ ఇబ్రాహీమ్ కేంద్రాన్ని, బహుదైవారాధనా మాలిన్యాల కొరకు వినియోగించేందుకు అనుమతి నివ్వడం జరగ రాదు అన్న ప్రకటన హజ్జ్ సమయాన జరిగితే దేశమంతా వ్యాపిస్తుంది.

అందువల్ల, ఈ ఏడాది తరువాత మరెన్నడూ దైవ తిరస్కారులూ బహుదైవారాధకులూ ఎవ్వరూ హజ్జ్ కొరకు మక్కాకు రాకూడదని, వారు మక్కాపుణ్యపురిలోకి కూడా ప్రవేశించరాదని, నిషేధాజ్ఞలు జారీ చేయవలసి ఉంది. ఇంకా, లోగడ ఇస్లామీయ రాజ్యం చేసుకున్న ఒప్పందాలూ ఒడంబడికలూ, వాటి ప్రస్తుత వ్యవధి ముగిసిపోయిన తరువాత, ఆ వ్యవధిని మరీ పెంచడం జరగదు అని కూడా ప్రకటించవలసి ఉంది.

ఈ ముఖ్యమయిన ప్రకటనలన్నీ చేయడానికి ప్రవక్త మహనీయులు(స) తన ఆప్త మిత్రులు, సీనియర్ సహచరులు మహనీయ అబూ బక్ర్(ర)ని ఎన్నుకున్నారు. ఆయనకు తోడుగా హజ్జ్ చేయడానికి బయలుదేరిన మూడు వందల మంది సహచర మాన్యులలో పేరుగన్న సహచరులున్నారు. దివ్య కుర్ఆన్ ఈ హజ్జ్ ని “హజ్జుల్ అక్బర్ (గొప్ప హజ్జ్)”గా పేర్కొన్నది. (అత్ తౌబా 9 : 3).ఈ సందర్భంలోనే మహనీయ అబూ బక్ర్ ముస్లిములకు హజ్జ్ చేసే సరయిన విధానమూ తెలిపారు. అప్పుడు మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ అక్బర్, హజ్జ్ చేస్తున్న ఓ మహా సమావేశంలో ప్రసంగిస్తూ జనావళి హృదయాలను కదిలించారు.

## 4. ప్రవక్త (స) చివరి ప్రసంగం

ప్రవక్త శ్రీ (స), హి॥జీ 10, జీకఅదా నెల, 26వ తేదీ, శనివారం నాడు హజ్జ్ కొరకు అబూబక్ర్(ర)తోపాటు వెళ్ళి వచ్చారు. అటు నుంచి వచ్చిన తరువాతనే కాయలా పడ్డారు. ఆ రోజుల్లోనే ఆయన ఓ ప్రసంగం చేశారు. అందులో,

“దైవం తన దాసునికి ప్రపంచం పరలోకాల మధ్య దేన్నయినా ఎన్నుకునేందుకు అవకాశం ఇచ్చాడు. అంటే అతను ప్రపంచంలో ఉండదలిస్తే అలా ఉండవచ్చు, లేదా పరలోకాన్ని కోరుకుంటే అలానూ చేయగలడు. కాని అతను పరలోకాన్నే కోరుకున్నాడు”అని నుడివారు.

మహనీయ అబూ బక్ర్ ఇది విని రోదించసాగారు. జనం ఆయన్ని చూసి ఇందులో రోదించవలసిన విషయం ఏముందీ అని ఆశ్చర్యపోయారు. అబూ బక్ర్ (ర)ని శోకంలో ముంచివేసిన విషయం ఆ నిండు సమావేశంలో ఎవరికీ బోధపడలేదు. కాని ఆయన దాన్ని గ్రహించ గలిగారు. ఆయనకు అర్థమయిపోయింది, ఇందులో దైవ దాసుడంటే స్వయంగా ప్రవక్త శ్రీ (స) అని. ఆ ప్రసంగంలో ఆయన (స) ఇంకా ఇలా అన్నారు,

“నేను అందరికన్నా అధికంగా ఎవరి ప్రేమకు, స్నేహానికీ, సంపదకూ రుణపడి ఉన్నానంటే అది అబూ బక్ర్ (ర).

ప్రపంచంలో ఎవరినయినా నాకు ప్రియ మిత్రుడు ఉన్నారంటే అదీ నిర్ద్వంద్వంగా అబూ బక్ర్ మాత్రమే. కాని ఇస్లామ్ బంధుత్వం ఆయనతో మైత్రికి చాలు. ప్రవక్త మస్జిద్ ప్రాంగణంలోకి ఎవరెవరి కిటికీలు తెరచుకుంటాయో వాటినన్నింటినీ మూసివేసి ఒక్క అబూ బక్ర్ ఇంటి కిటికీని తెరచి ఉంచాలి."

## ఆయన(ర) నమాజ్ నాయకత్వం

హిజ్రీ 11వ సంవత్సరం 18 లేదా 19వ తేదీ అర్థ రాత్రి తరువాత ప్రవక్త శ్రీ (స) ఆరోగ్యం మరీ క్షీణించింది. జ్వరం, తలనొప్పి పెరిగిపోయాయి. ఆ వ్యాధి హెచ్చుతూ తగ్గుతూ ఉండింది. వ్యాధి సోకిన పదవ రోజున తలకు రుమాలు చుట్టుకుని ఆయన మస్జిద్ వెళ్లి మగ్రిబ్ నమాజ్ చేయించారు. ఇషా నమాజ్ చేయించడానికి ఒంటి మీద మాటిమాటికి నీరు పోయించి జ్వరం తగ్గుతుందని చూశారు, తగ్గ లేదు. మూడుసార్లు స్పృహ తప్పడమూ జరిగింది.

మూడవసారి స్పృహ వచ్చినప్పుడు మహనీయ ఆయిషాతో బలహీన స్వరంలో, "అబూ బక్ర్‌కు చెప్పు, నమాజ్ చేయించ మని" అన్నారు. ఆవిడగారు, "దైవ ప్రవక్తా, అబూ బక్ర్ అతి బలహీన మనస్కులు, నమాజ్ నాయకత్వ స్థానంలో మీరు లేకపోవడం ఆయన్ని కలచివేస్తుంది, ఆయన నమాజ్ చేయించ లేకపోతారు"అని. ఆయన్నుండి ఆ బాధ్యత తప్పించ చూశారు. కాని ఆయన (స) పట్టు పట్టారు, "కాదు, అబూ బక్ర్ నమాజ్ చేయించాలి."

ఆ తరువాత మహనీయ ఆయిషా (ర) విశ్వాసుల మాతృమూర్తి మహనీయ హఫ్సా చేత చెప్పించి చూశారు, ఇలా మాటిమాటికి సలహాలివ్వటంతో ఆయన (స) విసిగిపోయి, "మీ వ్యవహారం, మహనీయ యూసుఫ్‌ని మోసగించ జూసిన ఈజిప్టు మహిళల్లా ఉంది," అని కోపగించుకున్నారు. దానితో విశ్వాసుల మాతృ మూర్తులందరూ భయ విహ్వాలురయి మౌనం దాల్చారు.

మహనీయ అబూ బక్ర్ తనకు, ప్రవక్త శ్రీ (ర) స్థానంలో నమాజ్ చేయించే ఆదేశమయినందుకు బాగా చింతిల్లారు,ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. శుక్రవారం ఇషా నమాజ్ మొదలుగా నిర్ధారణాగ్రేసరులు (సిద్దీక్ అక్బర్) నమాజ్ చేయించడం ప్రారంభమయింది.

## వికసించిన ముఖారవిందం

సోమవారం ఉదయం నమాజ్ వేళ ప్రవక్త (స) ఆరోగ్యం కొంత మెరుగయినట్లు అగుపించింది. ఆ సందర్భంలో ఆయన ఉన్న మహనీయ ఆయిషా గది మస్జిద్‌కు అనుకునే ఉండేది. ఫజ్ర్ నమాజ్ కొరకు ఇకామత్ శబ్దాలు వినగానే ప్రవక్త శ్రీ గది ద్వారం వద్దకు వచ్చి పైన వ్రేలాడుతున్న తెర కాస్త తొలగించి చూశారు, ఆయన శిష్యగణం, ఆయన ప్రియ సహచరులు, దైవ భక్తులు, ఎంతో అణకువతో, ఏకాగ్రతతో నమాజ్ వరుసలలో నిలబడి నమాజ్ ప్రారంభం కొరకు వేచి చూస్తున్నారు.

దేవుని చివరి ప్రవక్త ఈ దృశ్యం చూసి ఆనందంతో దరహసిం చారు. ఆకస్మాత్తుగా అదే సమయాన ప్రవక్త ప్రియుల దృష్టి కూడా ఆయన(స) మీద పడి, ఆ దృశ్యాన్ని తిలకించిన వారంతా దాన్ని యథాతథంగా తమ మస్తిష్కాలలోనూ తమ ఉల్లేఖనాల లోనూ భద్రపరచి నేటి వరకు చేర వేశారు. వారు ఇలా ఉల్లే ఖించారు, "ఆ సమయాన మా ప్రియతమ నాయకుని ముఖ వర్చస్సు అద్దంలా జ్యోతిర్మయమయింది." అందరి అంత ర్యాలు ఆనందంతో వెలిగిపోయాయి. అబూ బక్ర్ కూడా సంతోషంతో 'ఇక ఆయన వచ్చి నమాజ్ చేయిస్తార' ని అను కున్నారు, అందువల్ల ఇమామత్ (నమాజ్ చేయించే) జాగా వదలి క్రమంగా వెనిక్కి తగ్గ సాగారు. ఆయన చేత్తో వారించి ఆపారు. ఆ పైన తెర వదలి తిరిగి లోనికి వెళ్ళి పోయారు.

ఫజ్ర్ నమాజ్ చేయించిన తరువాత మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ (ర) తన కూతురు గదిలోకి వెళ్ళారు, ప్రవక్త శ్రీ (స) ఆరోగ్యం గురించి విచారించడానికి. ఆయన ఆరోగ్యం మునుపటికంటే మెరుగ్గా ఉంది. కాస్సేపయిన తరువాత ప్రవక్త శ్రీ (స) ఆయనకు ఇంటికి వెళ్లే అనుమతి నిచ్చారు. ఆ ఇల్లు కాస్త దూరాన సునహ్ అనే చోట ఉండేది, అక్కడే ఆయన ఓ ఇల్లాలు హబీబా ఉండేవారు. కాని ప్రొద్దు ఎక్కే కొద్దీ ప్రవక్త ఆరోగ్య పరిస్థితి క్షీణించ సాగింది, కడకు అస్ర్ వేళన ఆయన (స) శుభాత్మ తన ప్రభు సాన్నిధ్యాన చేరింది.

**ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్**


మనమందరం దైవం కొరకే, మరి ఆయన వైపునకే
మరలి వెళ్ళవలసి ఉంది!

## 5. ప్రవక్త శ్రీ(స) నిష్క్రమించిన తరువాత

ప్రవక్త శ్రీ పరమపదించిన వార్త మదీనా పురజనులకు పిడుగు పాటుగా పరిణమించింది. బాధ, ఆవేదన, ఆందోళన వారిని చుట్టుముట్టాయి. అంతర్యాలు దుఃఖజ్వాలలతో అగ్ని గుండా లయి భగభగ మండుతున్నాయి. మనస్సులు అదుపు తప్పాయి. మహనీయ అబూ బక్ర్‌కు సమాచారం అంది ఆయన ఇంటి నుండి వచ్చేశారు. ఆయన ఎవరినీ పలకరించనూ లేదు. నేరుగా మహనీయ ఆయిషా గదిలోకి ప్రవేశించి ప్రవక్త ముఖం పైన కప్పిన దుప్పటి తొలగించి చూశారు. నుదుటిని చుంబించారు. రోదిస్తూ పలికారు,

"నా తల్లిదండ్రులు మీ కొరకు త్యాగం చేద్దును, దైవం మీద ఒట్టు, మీకు మరో మృత్యువు రాజాలదు, రావలసినదేదో వచ్చే సింది, దాన్ని మీరు చవిగొన్నారు కూడా." ❑

'చరితార్థులు'-2



# దూదు మియా

## (1818-1860)

23






**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త సయ్యిద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

**బెంగాల్‌లో** జరిగిన ప్లాసీ – బక్సర్ యుద్ధాల తరువాత తమ పునాదులను పటిష్టం చేసుకున్న ఆంగ్లేయులు చలాయిస్తున్న ఆధిపత్యం, అంతులేని దోపిడీని సహించలేక తిరగబడిన ప్రజలకు సమర్థవంతమైన నాయకత్వం అందించి ప్రజా పోరాటం సాగించిన యోధులలో దూదు మియా లేక దాదూ మియా ఒకరు. బ్రిటీష్ వ్యతిరేక పోరాటల చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఫరాజీ ఉద్యమానికి అంకురార్పణ చేసిన హాజీ షరియతుల్లా ఇంట 1819లో దూదు మియాగా పేరు గాంచిన ముహమ్మద్ మోసిన్ జన్మించారు. చిన్ననాటనే తండ్రి బాటన నడుస్తూ దూదు మియా ధార్మిక చింతనతో పాటుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల పట్ల అవగాహన సంతరించుకున్నారు. 1839లో తండ్రి స్థానంలో ఫరాజీ ఉద్యమనేతగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అపూర్వ కార్యదక్షత, చక్కని ఉద్యమ నిర్మాణ కౌశల్యం ప్రదర్శిస్తూ, దూదు మియా ఫరాజీ ఉద్యమాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్ది సకారాత్మక దిశగా మలుపుతిప్పారు. ప్రజాకంటకులైన ఆంగ్లేయాధికారులకు, జమీందారులకు, ప్లాంటర్లకు, మహాజనులకు (వడ్డీ వ్యాపారస్థులు) వ్యతిరేకంగా పోరాటాలు సాగించేందుకు పటిష్టమైన సమరశీల వ్యవస్థలను రూపొందించారు. ఫరాజీ ఉద్యమ కార్యక్రమాలను నిర్వహించడానికి ఫరీద్‌పూర్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని ప్రజా పోరాటాలు నడిపారు. దూదుమియా పిలుపిస్తే క్షణాలలో హాజరుకావడానికి 50 వేల మంది ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారు అని అంగ్లేయాధికారులు తమ నివేదికలలో వెల్లడించడాన్ని బట్టి వ్యవస్థాపరంగా ఆయన ఉద్యమ నిర్మాణ దక్షత వెల్లడవుతుంది. దూదు మియా ఉద్యమాన్ని ఏ విధంగానూ నిలువరించలేకపోయిన ఆంగ్లేయులు ఆయన మీద, ఉద్యమకారుల మీద పలు నేరాలను ఆపాదించి వారికి శిక్షలు పడేలా శతవిధాలా విఫల ప్రయత్నాలు చేశారు. ప్రజలలో ఆయన పాదు గొల్పిన బ్రిటిష్ వ్యతిరేకత, పోరాట స్ఫూర్తి వలన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో ఫరాజీలు విజృంభించగలరని ఆంగ్ల ప్రభుత్వం భయపడింది. ఆ కార ణంగా దూదు మియాను, ఆయన అనుచరులను పెద్ద సంఖ్యలో జైళ్ళల్లో కుక్కినా ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఫరాజీల జాడలు చాలా స్పష్టంగా కన్పించాయని ఆంగ్లేయాధి కారుల రికార్డులు వెల్లడించాయి. ఆంగ్లేయుల జైలు నుండి విడుదలై ప్రస్తుత బంగ్లాదేశ్ రాజధాని ఢాకాను స్థిర నివాసం చేసుకుని చివరిక్షణం వరకు ఆంగ్లేయుల ఆగడాలను, అధికారుల పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ పోరుబాట సాగిన దూదు మియా 1860లో అస్తమించారు. ✤




ఈ వారం ఫేక్ వార్తలను గమనిస్తే, నవంబర్ 4వ తేదీన బూమ్ వార్తసంస్థలో సుజిత్, అన్మోల్ అల్ఫోన్సోలు ఒక ఫేక్ వీడియో గుట్టు రట్టు చేశారు. ఇజ్రాయెల్‌లోని యుఎస్ ఎంబసీపై హమాస్ దాడి చేసిందన్నట్టు చూసించే ఒక ఫేక్ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం ప్రారంభించింది. వాస్తవానికి, ఈ వీడియో మే 30, 2020న అమెరికా, వర్జీనియాలో ఉన్న డొమినియన్ ఎనర్జీ పాత ప్రధాన కార్యాలయాన్ని కూల్చివేసిన సంఘటనకు సంబంధించింది. ఆ కూల్చివేత అధికారికంగా, నిపుణుల నియంత్రణలో జరిగిన కూల్చివేత. ఫేస్‌బుక్, యూట్యూబ్, టిక్ టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఈ తప్పుడు సమాచారం ప్రచారం చేశారు. అక్టోబరు 7 హమాస్ దాడి తర్వాత గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల నేపథ్యంలో ఈ ఫేక్ వార్త వచ్చింది. ఇస్రాయీల్ దాడుల్లో అమాయక పౌరులు పెద్ద సంఖ్యలో మరణిస్తున్న వార్తల నేపథ్యంలో ఈ ఫేక్ వార్తను చూడాలి. ఇస్రాయీల్ దాష్టికాలకు పరోక్ష సమర్థింపునిచ్చేలా ప్రజాభిప్రాయాన్ని మలచడానికి ఉద్దేశించిన ఫేక్ వార్తలివి. సున్నితమైన సమయాల్లో ఉద్రిక్తతలను పెంచి, ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ ప్రచారం ఇది.. తప్పుడు సమాచారం వ్యాప్తిని ఎదుర్కోవడంలో బాధ్యతాయుతమైన జర్నలిజం ఆవశ్యకతను చాటి చెబుతున్నయి ఈ సంఘటనలు.

మరో ఫేక్ వార్త చూద్దాం, ఈ వార్త కేరళకు సంబంధించింది. కేరళలో పాలస్తీనా అనుకూల ర్యాలీలో తిరువనంతపురం పార్లమెంటు సభ్యుడు శశి థరూర్ తీవ్రవాద సంస్థ హమాస్‌కు మద్దతు ఇస్తున్నట్లు మాట్లాడినట్లు వీడియో ప్రచారంలోకి వచ్చింది. అక్టోబర్ 26న కోజికోడ్ బీచ్‌లో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (IUML) నిర్వహించిన ర్యాలీకి సంబంధించిన వీడియో సోషల్ మీడియా పోస్ట్‌లలో వక్రీకరించి చూపించారు. నిజానికి థరూర్ హమాస్, ఇజ్రాయెల్ రెండింటి చర్యలను ఖండించారు, హమాస్‌ను ఉగ్రవాదులుగా పేర్కొంటూ హమాస్ అక్టోబర్ 7 దాడికి ప్రతిస్పందనగా ఇస్రాయీల్ పాలస్తీనాలో సృష్టిస్తున్న రక్తపాతాన్ని కూడా ఆయన విమర్శించారు. ప్రకటనలు యుద్ధ చట్టాలు, జెనీవా ఒప్పందాలను ఉల్లంఘించడాన్ని థరూర్ వేలెత్తి చూపించారు. అమాయక పౌరుల రక్షణ గురించి నొక్కి చెప్పారు. థరూర్ ప్రసంగాన్ని తప్పుగా చూపించి, రెచ్చగొట్టే కథనాలతో అగ్నికి ఆజ్యం పోసేలా వాస్తవాలను వక్రీకరించడం ఈ ఫేక వార్తలు ప్రచారం చేస్తున్న వారి ముఖ్య ఉద్దేశ్యం. ఇటువంటి చర్యలు ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా వ్యక్తులను, సంస్థలను అన్యాయంగా కించపరుస్తాయి, ఉద్రిక్తతలను రేకెత్తిస్తాయి. నవంబర్ 3న క్వింట్ వార్తా సంస్థ ఈ ఫేక్ ప్రచారం వాస్తవాన్ని బట్టబయలు చేసింది.

ఇంకో తప్పుడు వార్తను చూద్దాం, అక్టోబర్ 23న పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియంలో భారత జాతీయ జెండాను నిషేధించారనే తప్పుడు వార్త వైరల్ అయ్యింది. ఆల్ట్ న్యూస్ ఇది తప్పుడు వార్త అని నిర్ధారించింది. ఒక పోలీసు సబ్-ఇన్‌స్పెక్టర్ భారత జెండాను డబ్బాలోంచి తీసి పోలీసు వ్యాన్‌లో ఉంచు

తున్నట్లు చూపించే వీడియో ద్వారా ఈ పుకారు మొదలు పెట్టారు. ఇది డిఎంకె ప్రభుత్వం, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టిఎన్‌సిఎ)ల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి తమిళనాడు బిజెపి అధ్యక్షుడు కె. అన్నామలై తదితరులు పన్నిన కుట్రగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారత జెండాను స్టేడియంలోకి తీసుకెళ్లడంపై ఎలాంటి నిషేధం లేదని ట్రిప్లికేన్ డిప్యూటీ కమిషనర్ దేశ్‌ముఖ్ శేఖర్ సంజయ్ స్పష్టం చేశారు. ఈ సంఘటన ఒక సబ్ ఇన్‌స్పెక్టరు అత్యుత్సాహం వల్ల చోటు చేసుకుంది. అతన్ని విచారణ తర్వాత కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసులు కూడా ట్విట్టర్‌లో ప్రతిస్పందించారు, చాలా మంది ప్రేక్షకులు స్వేచ్ఛగా స్టేడియం లోపల భారత జెండాను తీసుకువెళుతున్నారని, ఎలాంటి నిషేధాలు లేవని ప్రకటించారు. తప్పుడు సమాచారం ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుందో ఈ సంఘటన వల్ల తెలుస్తోంది. సమాచారాన్ని నమ్మే ముందు, ఫార్వార్డ్ చేసే ముందు ధృవీకరించుకోవడం ఎంత అవసరమో దీన్ని బట్టి తెలుస్తోంది.

మరో ఫేక్ వార్త చూద్దాం, ఆస్ట్రేలియా వెళ్లడానికి బదులుగా పొరపాటున ఆస్ట్రియా వెళ్ళిన వారికి ఆస్ట్రియాలోని సాల్జ్‌బర్గ్ విమానాశ్రయంలో ప్రత్యేక డెస్క్‌ని ఉందని సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అయ్యింది. ఆన్‌లైన్‌లో ఈ వార్త చాలా మందిని ఆకర్షించింది. ది క్వింట్ వార్తా సంస్థ వార్త పచ్చి అబద్ధంగా తేల్చి చెప్పింది. ఆస్ట్రియా విమానాశ్రయం అధికారులు, సెక్యూరిటీ, కమ్యూనికేషన్ కంపెనీ కమెండ్ ఇంటర్నేషనల్ తదితరులు అటువంటి డెస్క్ ఎప్పుడూ ఉనికిలో లేదని ధృవీకరించారు. ఆస్ట్రియా, ఆస్ట్రేలియాల మధ్య తరచు అంతర్జాతీయ ప్రయాణీకులు ఎదుర్కొనే అయోమయంపై హాస్యం కోసం ఎవరో పెట్టిన పోస్టు ఇది. హాస్యాన్ని తప్పుగా అర్థం చేసుకుని కొందరు తప్పుదారి పట్టించేలా ప్రచారం చేసే ప్రమాదాన్ని ఈ సంఘటన సూచిస్తోంది.

ఇంకో ఫేక్ వార్త చూద్దాం, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన కమల్ నాథ్ తాను ఎన్నికైతే లాడ్లీ బెహనా పథకాన్ని రద్దు చేస్తానని చెప్పారంటూ ఒక కథనం వైరల్ అయ్యింది. ఇది ఒక ఆడియో క్లిప్. సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం, అర్హులైన మహిళలకు నెలవారీ స్టైఫండ్‌ను అందిస్తుంది, ఇటీవల ఈ పథకం క్రింద లభించే మొత్తాన్ని రూ.1,250కి పెంచారు. మధ్యప్రదేశ్‌లో నవంబర్ 17న ఎన్నికలు జరగబోతున్నాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెలువడతాయి. ఈ నేపథ్యంలో ప్రజలను తప్పుదారి పట్టించేలా ఈ వీడియో వచ్చింది. కమల్ నాథ్ మహిళల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తారన్నట్లు రెచ్చగొట్టే క్యాప్షన్‌లతో దీన్ని ప్రచారంలో పెట్టారు. బూమ్ వార్తా సంస్థ నిజనిర్ధారణలో ఈ వార్త పెద్ద అబద్ధమని బట్టబయలు అయ్యింది. ఆడియోను సూపర్ ఇంపోజ్ చేశారని, కమల్ నాథ్ మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో చేసిన అసలు ప్రసంగంలో అసలు ఈ లాడ్లీ పథకం గురించి ప్రస్తావనే లేదని స్పష్టమయ్యింది. ఆయన తన కాలంలో సాధించిన విజయాలను, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను తన ప్రసంగంలో వివరించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అసలు ప్రసంగాన్ని మార్చి నకిలీ వార్తలు ప్రచారంలో పెట్టి బీజేపీకి లాభం చేకూర్చే ప్రయత్నం ఈ ఫేక్ వార్త వెనుక ఉంది. ముఖ్యంగా ఎన్నికల వంటి సున్నితమైన సమయాల్లో సమాచారాన్ని వెరిఫై చేయడంలో తగిన శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరాన్ని చాటి చెప్పే సంఘటన ఇది. ఈ పేక్ వార్త ప్రచారంలోకి వచ్చిన తర్వాత మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి రాకేష్ సింగ్ యాదవ్ వేగంగా చర్యలు తీసుకున్నారు. ఈ ఫేక్ వార్తకు వ్యతిరేకంగా క్రిమినల్ ఫిర్యాదును దాఖలు చేశారు.

## ముస్లింలకు మాత్రమే ఉచిత కార్ల పంపిణీ చేసారన్నది వాస్తవం కాదు

తెలంగాణ సీఎం కేసీఆర్ ముస్లింలను ప్రసన్నం చేసుకుని ఓట్లు దండుకునేందుకు రూ.12 వేల కోట్లు కొల్లగొట్టాడంటూ టీఎస్ఎంఎఫ్‌సీ అని రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకొని కొత్త కార్ల పక్కన కొందరు వ్యక్తులు నిలబడి ఉన్న వీడియో విస్తృతంగా ప్రచారంలో ఉంది. "ముస్లింలకు మాత్రమే ఉచిత కార్ల పంపిణీ? పన్ను చెల్లింపుదారుల సొమ్ముతోనా? ముస్లింలలో 5% కంటే తక్కువ మంది మాత్రమే ఏదైనా పన్ను, ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లు లేదా నీటి బిల్లులను చెల్లిస్తారు. 80% ముస్లిం షాపు యజమానులకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ కూడా లేదు, రిటర్న్‌ల దాఖలు లేదు, జిఎస్టీ చెల్లింపు లేదు, తెలంగాణ సీఎం కేసీఆర్ ముస్లింల ఓట్లను ప్రసన్నం చేసుకునేందుకు సుమారు 12000 కోట్లు దోచుకున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాలు మన దేశాన్ని ఇలా నాశనం చేస్తున్నాయి. పన్ను చెల్లింపుదారుల డబ్బును అభివృద్ధి కోసం మాత్రమే ఖర్చు చేయాలి, ఉచితాలు ఇవ్వకుండా ఉండటానికి కొన్ని చట్టం అమలులో ఉండాలి." అని ప్రచారం చేశారు. ఇది తప్పుదారి పట్టించే అబద్ధపు విషప్రచారం. తెలంగాణ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అనేక మంది అర్హత కలిగిన మైనారిటీ డ్రైవర్లకు డ్రైవర్-కమ్-ఓనర్ పథకం కింద కార్లను పంపిణీ చేసింది. అక్టోబర్ 5న నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హెూం మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ హైదరాబాద్‌లోని మైనారిటీలకు సబ్సిడీ కార్లను పంపిణీ చేశారు. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు మాత్రమే ఉచిత కార్లను అందించిందన్న వాదన తప్పుదారి పట్టించేది. వివిధ మైనారిటీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందారు.




**దైవప్రవక్త** సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా సెలవిచ్చారు: గర్భంలో ఒక బిందువు ప్రవేశించగానే మనిషి పుట్టుక మొదటి మజిలీ మొదలవుతుంది. ఆ బిందువు క్రమక్రమంగా నెత్తుటి ముద్దలా ఏర్పడుతుంది. తదుపరి మాంసపు ముద్దలా తయారవుతుంది. 120 రోజుల ఈ కాలక్రమం తర్వాత మనిషి పుట్టుక ఒక రూపాన్ని దాలుస్తుంది. అప్పుడు అల్లాహ్ తన దైవదూతను పంపిస్తాడు. ఆ దైవదూతను ఆ మాంసపు ముద్దలో ప్రాణం పోసి, నాలుగు విషయాలను గురించి వ్రాయమని ఆదేశించడం జరుగుతుంది. ఉపాధి, ఆయుష్షు, ఆచరణ, అతను మంచి వ్యక్తిగా మారుతాడా లేక దుర్మార్గునిగా తయారవుతాడా ఇత్యాదివి.

తఖ్దీర్ (తలరాత ,అదృష్టం) అంటే శాబ్దిక అర్థం అంచనా వేయడం. ఇస్లాం పరిభాషలో సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ తన సంపూర్ణ జ్ఞానంతో మనిషి గురించి అతని అదృష్టాన్ని రాస్తాడు. అది అల్లాహ్ రచించాడు కాబట్టి అందులో ఏమాత్రం లోపం ఉండదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా ప్రవచించారు : మనిషి ఆచరణ ఒక్కోసారి చూడ్డానికి స్వర్గానికి అర్హుడు అయ్యేలా ఉంటుంది. ఒక్కోసారి నరకానికి అర్హుడు అయ్యేలా ఉంటుంది. ఇలానే జీవితం కొనసాగుతూ ఉంటుంది. కానీ చివరి రోజులలో అతని ఆచరణలో మార్పు సంభవిస్తుంది. ఇలా ఎందుకు జరుగుతుందంటే అల్లాహ్ తాను సంపూర్ణ జ్ఞాని అయినప్పటికీ మనిషికి స్వేచ్ఛను ప్రసాదించాడు. కాబట్టి మనిషి అర్హతను అతని ఆచరణ మాత్రమే నిర్ణయిస్తుంది.

అందుకే మనిషి తన ముగింపును గురించి భయపడుతూ ఉండాలి. స్వర్గానికి అర్హత సంపాదించే ఆచరణతోనే తనకు మృత్యువు సంభవించాలని నిత్యం ప్రార్థించుకోవాలి. దీనినే ఈమాన్ బిల్ ఖద్ర్ (అదృష్టాన్ని విశ్వసించడం) అంటారు. మౌలానా సులైమాన్ నద్వీ (రహ్మ) గారు దీని గురించి అత్యుత్తమమైన మాటలు రచించారు.

ఈమాన్ బిల్ ఖద్ర్ అర్థం ఏమిటంటే ఈ ప్రపంచంలో ఏదైతే ఇప్పటి వరకు సంభవించిందో, ఇక ముందు సంభవిస్తుందో, ప్రస్తుతం సంభవిస్తున్నదీ అంతా అల్లాహ్ జ్ఞాన పరిధిలో ఉన్నదే. ఏ విధంగానైతే ఒక ఇంజనీర్ ఇంటిని నిర్మించే ముందు ఆ స్థలాన్ని పరిశీలించి ఒక డిజైన్ రూపొందించుకుంటాడో, అదే డిజైన్‌కు అనుగుణంగా కార్మికులు ఆ నిర్మాణాన్ని పరిపూర్తి చేస్తారో, అదేవిధంగా సర్వసృష్టి ఇంజనీర్ అయిన అల్లాహ్ సృష్టిని సృష్టించే మునుపే దాని పరిపూర్తి, నియమ నిబద్ధతలను, ఇతర ముఖ్యమైన విషయాలను నిర్ణయించి ప్రతి విషయానికి గాను ఒక తుది నిర్ణయాన్ని రాసి పెట్టేసాడు. ఇప్పుడు దాని ప్రకారంగానే ఈ సృష్టి, సంఘటనలు అన్నీ జరుగుతున్నాయి. జీవన్మరణాలు, కలిమి లేములు, జయాపజయాలు, సుఖ దుఃఖాలు, కష్టనష్టాలు- ప్రతి విషయం మొదటి నుంచే నిర్ణయించబడి ఉంది. దాని ప్రకారంగానే అది అమలు అవుతుంది.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి దైవదౌత్యంలో ఈ

అదృష్టాన్ని కేవలం సిద్ధాంతంలా పరిగణించి వదిలి వేయబడ లేదు. దానికి భిన్నంగా పలుమార్లు ఈ విషయాన్ని ప్రస్తావించి దానిని విశ్వాసంగా పరిగణించడం జరిగింది. ఈ విశ్వాసం దృఢమైన నమ్మకంలా మనిషి నరనరాల్లో చొచ్చుకుని పోవాలి. ఇలా ఎందుకంటే మనిషి జీవితంలో సంభవించే కష్టాలు, సంఘటనలు, ప్రమాదాలు అన్నీ దైవ నిర్ణయమే అని అతను విశ్వసించాలి. ఇది ఒక ప్రయోజనకరమైన బోధనారూపం దాల్చాలి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి వద్దకు చేర వేయబడిన దైవవాణిలో అదృష్టాన్ని రెండు పదాలతో పేర్కొనడం జరిగింది.

1) ఖద్ర్ అంటే అంచనా

2) ఖజా అంటే నిర్ణయం

మేము ప్రతి వస్తువునూ ఒక విధి నిర్ణయంతో పాటు సృష్టించాము. (అల్ ఖమర్ : 49)

ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించాడు. తరువాత మీ కొరకు ఒక జీవన వ్యవధిని నిర్ణయించాడు. (అన్ ఆమ్ :2)

ఈ రెండు పదాలు స్వయంగా ఇస్లాంలో అదృష్టాన్ని విశ్వసించడం పట్ల ఉన్న వాస్తవాన్ని పూర్తిగా విశ్లేషిస్తున్నాయి. ఉద్దేశం ఏమిటంటే సృష్టిలోని ప్రతి వస్తువుకు సంబంధించి అల్లాహ్ తన అంచనా ప్రకారం వారి తలరాతల గురించి ప్రతి విషయంలో తుది నిర్ణయం చేసేశాడు. దీని ప్రకారం ఈ సృష్టి నడుస్తుంది. ఇందులో అల్లాహ్ ఆజ్ఞ లేనిదే కొద్దిపాటి మార్పు కూడా సంభవించదు. ఆకాశాన్ని ఏ విధంగానైతే సృజించాడో , సూర్యుణ్ణి ఎంత వెలుతురుతో సృష్టించాడో, చంద్రునికి సంబంధించి ఏ నియమాలనైతే నిర్ణయించాడో, నక్షత్రాలు ఎప్పుడు ఉదయించాలో, ఎప్పుడు అస్తమించాలో దాని గురించిన ఏ ఆజ్ఞల నైతే జారీ చేశాడో, జీవన్మరణాలు, వినాశనాలు, ఉత్థాన పతనాలు- ఈ విధంగా సృష్టికి సంబంధించిన ప్రతి కోణం గురించి అల్లాహ్ ఏవైతే నిర్ణయించాడో వాటి ప్రకారంగానే అవి మనుగడ కొనసాగిస్తున్నాయి.

ప్రతి వస్తువు గురించి ఏదైతే అల్లాహ్ నిర్ణయించి ఉంచాడో దానినే అందరూ ప్రకృతి నియమంగా పిలుచుకుంటారు. ఇదేవిధంగా అల్లాహ్ సృష్టిలోని ప్రతి భాగంలో, ప్రతి కోణానికి సంబంధించి తమ ఆదేశాలను జారీ చేసాడు. దానిని అనుసరించడం తప్పనిసరి. మనిషి ఉత్థాన పతనాలు, జీవన్మరణాలు, ఆరోగ్య అనారోగ్యాలు, కలిమి లేములు, సుఖదుఃఖాలు, పాప పుణ్యాలు ప్రతి విషయంలో నియమ నిబంధనలు జారీ చేశాడు.

ఏ ఆపద అయినా అల్లాహ్ అనుమతి లేనిదే ఎన్నటికీ రాదు. (అత్ తగాబున్ 11)

ఖజా, ఖద్ర్- ఈ రెండింటి వాస్తవ ఉద్దేశం విశ్వాసం, నైతిక విలువలు అని ఖుర్‌ఆన్ వివరించింది. మనిషి తన చిరు ప్రయత్నంతో ఏదైనా విజయాన్ని సాధిస్తే గర్వానికి పోతాడు. ఎప్పుడైనా అపజయం పాలైతే పూర్తిగా నిరాశ చెందుతాడు. ఈ నైతిక పతనం ఎందుకు కలిగి ఉంటాడంటే తన జీవితంలో సంభవించే మంచీచెడులు తన కృషి ద్వారానే సంభవిస్తాయని భావించడమే. ఒక్కోసారి తన కృషితో సాధిస్తే గర్వాహంకారిగా మారిపోతాడు. ఒక్కోసారి నిరాశ పరునిగా మారిపోతాడు. ఈ రెండు పరిస్థితులు మనుష్యుల ఓర్పును, స్థిరత్వాన్ని నాశనం చేస్తాయి.

అందుకే మనిషి జయాపజయాల పరిస్థితులలో, సంతోషంలోనూ, దుఃఖంలోనూ వినయ వినమ్రతలతో మెలిగేటటువంటి ఒక నమ్మకం, విశ్వాసం కావాలి. అదే ఈ అదృష్టంపై విశ్వాసం.

ఈ విశ్వాస ఆంతర్యం ఏమిటంటే మనకు ఏదైనా విజయం లభిస్తే అది మన ప్రయత్న ప్రతిఫలం కాదు, అల్లాహ్ అనుగ్రహం. అందుకే మనం గర్వాతిశయానికి పోవడం తగదు. అదే విధంగా ఏదైనా నష్టం వాటిల్లితే ఇది కూడా అల్లాహ్ వివేకం,విజ్ఞతలతోనే సంభవించింది అని మనం భావించాలి. మన ప్రతి పని వెనుక కూడా సర్వసృష్టికర్త నిర్ణయాలు ఉన్నాయని భావించాలి .మరలా మన ప్రయత్నంలో నిమగ్నమవ్వాలి.

భూమిపై గాని లేదా స్వయంగా మీ ఆత్మలపై గాని అవతరించే ఏ ఆపద అయినా సరే దానిని మేము ఉనికిలోకి తీసుకువచ్చే ముందు ఒక గ్రంథం (అంటే భాగ్య గ్రంథం)లో వ్రాసి పెట్టకుండా ఉండలేదు. అలా చేయటం అల్లాహ్‌కు చాలా సులభం. (ఇదంతా ఎందుకంటే) మీకు ఎలాంటి నష్టం జరిగినా, దానికి మీరు బాధపడకుండా ఉండాలని, అల్లాహ్ మీకు ఏదైనా ప్రసాదిస్తే, దానికి మీరు మిడిసిపడకుండా ఉండాలని. తమని తాము గొప్ప వారమని భావించి, అహంభావం ప్రదర్శించే వారిని అల్లాహ్ ప్రేమించడు. (అల్ హదీద్ 22)

ఈ వాక్యంలో ఖజా, ఖద్ర్‌లు ఎంతగా విశ్లేషించబడ్డాయంటే వాటికి మరింత వివరణ అవసరం లేదు. ఈ విశ్వాస ప్రతిఫలమే సహాబా (రజి) వారి శిరస్సులు విజయ పతాకాలను ఎగురవేసిన పరిస్థితులలో అల్లాహ్ ముందు సాష్టాంగ పడేవి. అపజయాల పరిస్థితులలో వారు ఆత్మ విమర్శనకు సమాయత్తమయ్యేవారు.

## దోష సవరణ

10-11-2023 సంచిక 16వ పేజీ పుస్తక సమీక్షలో ఒకచోట ఇంతెజార్ నయీమ్ గారి 'మానవ మహోపకారి' అని వచ్చింది. వాస్తవానికి అది నయీమ్ సిద్దీఖీ గారి అని ఉండాలి. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాము. - ఎడిటర్

వారి దైనందిన జీవితంలో ఏది తారసపడినా అది తన తరపునుంచి కాదు అల్లాహ్ తలిస్తేనే ఇది సంభవిస్తుందని మౌనం వహించేవారు. ఆర్థిక సంక్షోభం, రాజకీయ ఆపదలు, ప్రియమైన వారి ఎడబాటు, యుద్ధాలలో పరాజయం ఇత్యాది సందర్భాలలో వారు అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందేవారు కాదు. అత్యంత ప్రమాదకరమైన పనికై వారు నడుం బిగించేవారు. వారి విశ్వాసం ఏమిటంటే మరణం కచ్చితంగా నిర్ణీత సమయంలో సంభవిస్తుంది. ఏది జరగాలో అది ఖచ్చితంగా జరిగి తీరుతుంది. అందుకే వారి హృదయాలలో ఎటువంటి లక్ష్యం వారు కలిగి ఉండే వారంటే ఏ శక్తి కూడా దాన్ని ఆపలేదు. ఏ ఆపదల తుఫాను, ఏ మండుతున్న అగ్ని జ్వాలలు ఆ లక్ష్యాన్ని చిన్న బుచ్చేవి కావు.

ఈ విశ్వాసమే ముస్లింలను ఎంతో మనోస్థైర్యాన్ని , మనోనిబ్బరాన్ని, పటిష్టమైన లక్ష్యాన్ని, నిర్భయ శక్తిని ప్రసాదించే రహస్యం. కొందరు కొన్ని అపోహలతో ఈ విశ్వాసాన్ని కలిగి ఉండడం వలన మనిషి ఒత్తిడికి లోనవుతాడని, ఎటువంటి స్వేచ్ఛ లేకుండా జీవిస్తాడని భావించారు. తద్వారా మనిషి తన నుదుటిరాతపై నమ్మకం ఉంచుకొని ఓర్పుతో, కృతజ్ఞతతో బద్ధకంగా, నిర్లక్ష్యంగా తన జీవితాన్ని గడపాలి అని ద్యోతకమవుతుందని భావించారు. కానీ ఇదే ఒకవేళ నిజమైతే ప్రవక్తల పరంపర అవసరమే ఉండేది కాదు. ఆకాశ గ్రంథాలను అవతరింప చేయాల్సిన అవసరమే ఉండేది కాదు. సందేశ ప్రచారాలు, సంస్కరణలో ఇవేవీ అవసరమే ఉండేవి కావు. దీనికి భిన్నంగా అల్లాహ్ లక్ష పైచిలుకు ప్రవక్తలను పంపించాడు. ఎన్నో ఆకాశ గ్రంధాలను అవతరింపజేశాడు. కొన్ని కోట్ల సందేశ ప్రచారకులు ఇస్లాం సందేశాన్ని అందజేశారు. మార్గదర్శనం పై మాటిమాటికి తాకీదు చేయబడింది. ప్రజల వద్దకు సందేశాలు చేరవేయబడ్డాయి. సంస్కరించడం ముస్లింల విధిగా ఖరారు చేయబడింది. నిరంతర కృషి చేయాలని ప్రతి ముస్లింకి సూచించబడింది .ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి నిరంతర కృషితో నిండిన జీవితం మనందరికీ ఆదర్శప్రాయం.

వాస్తవం ఏమిటంటే ఒకవేళ నిజంగానే మనిషి స్వేచ్ఛా జీవి కాకపోయి ఉంటే ఏవిధంగానైతే ఇతర జీవరాసులు మంచీ చెడుల విచక్షణ జ్ఞానాన్ని కలిగి లేవో, అవి ప్రళయ దినాన స్వర్గనరకానికి అర్హులు కావో. మనిషి జీవితం కూడా అదే విధంగా ఉంది అని భావించాల్సి వస్తుంది. కాబట్టి మనిషి తన జీవిత లక్ష్యాన్ని గుర్తించి కేవలం తన అదృష్టంపై భరోసా పెట్టుకుని జీవితాన్ని గడపకుండా నిరంతర కృషితో తన మంచి ఆచరణతో స్వర్గానికి అర్హత సంపాదించాలి. ❖

## మధ్యప్రదేశ్‌లో వాడిపోతున్న కమలం

భారతీయ జనతా పార్టీ హిందుత్వపై మాత్రమే ఇప్పుడు ఆధారపడుతోంది. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ వంటి నినాదాలన్నీ ఇప్పుడు పనికివచ్చేలా కనబడడంలేదు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో బీజేపీ మతరాజకీయాలు ఇప్పుడు తీవ్ర విమర్శలను ఎదుర్కుంటున్నాయి. రామమందిర గురించి మాట్లాడడం ద్వారా మతపరమైన మనోభావాలను రెచ్చగొట్టేందుకు పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. కాని ఈ వ్యూహాలు ఫలిస్తున్నట్లు కనబడడం లేదు. ఓటర్లను ఈ మతతత్వం ఇప్పుడు పెద్దగా ఆకర్షించడం లేదు. ఓటర్లు తాము ఎదుర్కుంటున్న సమస్యల గురించి మాత్రమే ఆలోచిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. పైగా కాంగ్రెసు కూడా ఇప్పుడు తన స్థాయిలో హిందూత్వ రాజకీయాలు చేస్తోంది. కమల్ నాథ్ హిందూ మతబాబాలతోను, స్వాములతోను రాజకీయాలు చేస్తున్నారు. ఆ విధంగా హిందూత్వ రాజకీయాల్లో బీజేపీకి సవాలు విసురుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 28 నుండి మధ్యప్రదేశ్‌లో పర్యటించడం, రామమందిరానికి సంబంధించి కాంగ్రెస్‌ను అవహేళన చేయడం వంటివి గమనిస్తే మధ్యప్రదేశ్‌లో బీజేపీ కేవలం హిందూత్వ రాజకీయాలపైనే ఆధారపడిందని స్పష్టమవుతోంది. మతరాజకీయాలతో విజయాలు సాధించాలని బీజేపీ చూస్తోంది. కాని అధికారంలో ఉన్నప్పటికీ అంతర్గత కలహాలలో కూరుకుపోయి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి వంటి సమస్యలను పెంచిన పార్టీ పట్ల వారు విసిగిపోయారు. బిజెపి మతతత్వ ప్రచారం పట్ల ఓటర్ల స్పష్టమైన ఉదాసీనత, ప్రజా సమస్యల గురించి మాత్రమే ఆసక్తి ఉన్నట్లు స్పష్టమైన సంకేతాలు బీజేపీకి గడ్డుకాలమని చెబుతున్నాయి. బిజెపి మతరాజకీయాలను కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ఎదుర్కోవడం హిందూత్వంపై బిజెపి గుత్తాధిపత్యాన్ని సవాలు చేస్తోంది. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్ నాథ్ హిందూ గుర్తింపును బహిరంగంగా ప్రకటిస్తూ, హిందూబాబాలు, స్వాములతో కలిసి తిరుగుతున్నారు, మత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అనే బిజెపి కథనాన్ని ఇది బలహీనపరుస్తుంది. మధ్యప్రదేశ్‌లోని ఓటర్లు మతరాజకీయాలను కాదు తమ సమస్యల పరిష్కారం కోరుతున్నారు. ఇప్పటికే సర్వేలు కాంగ్రెస్‌కు ఆధిక్యత కనబరుస్తాయి. ఓటర్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా బిజెపి తన విధానాలు మార్చుకుంటుందా? అనేది చూడాలి. గత ఎన్నికల్లోను బీజేపీ ప్రత్యక్షంగా గెలిచి అధికారంలోకి రాలేదు. గెలుపొందిన కాంగ్రెసు ప్రభుత్వాన్ని కూల్చి అధికారంలోకి వచ్చిందనేది గుర్తించాలి.

# ఖతర్‌లో మరణశిక్ష పడిన వారి పరిస్థితేమిటి?

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై, భారతీయ జనతా పార్టీ) విధానాలపై అనేక విమర్శలు వస్తున్నాయి. అంతర్జాతీయ సంక్షోభాలను ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటు న్నారనే విమర్శలు ఎక్కువవుతున్నాయి. అంతర్జాతీయ సంఘటనల్లో ముఖ్యంగా ప్రస్తావించవలసింది కేసులో ఖతార్‌లో ఎనిమిది మంది మాజీ భారత నావికాదళ అధికారులు మరణశిక్షను ఎదుర్కొంటు న్నారు. కాని దీనిపై తక్షణం మానవీయంగా, దౌత్యపరంగా ప్రతిస్పందించే బదులు రాజకీయాలకు వాడుకోవడమే ఎక్కువ య్యిందని పలువురు ఆరోపిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు 2024లో జరగబోతున్నాయి. 2024లో రమజాన్ మాసం వచ్చే వరకు బీజేపీ ప్రభుత్వం వేచి ఉండవచ్చని, అప్పుడే రమజాన్ మాసం కూడా వచ్చే అవకాశాలున్నాయని, అప్పుడు దౌత్యపరంగా ఖతర్ నుంచి శిక్ష పడిన వారిని విడుదల చేయించడానికి ప్రయత్నిస్తే రాజకీయ ప్రయోజనాలు పొందవచ్చనే ఎత్తుగడలతో పనిచేస్తున్నట్లు కనబడు తుందని రోహిత్ ఖన్నా వంటి వారు విశ్లేషిస్తున్నారు. రమజాన్ మాసంలో ఖతర్ ప్రభుత్వం మరణశిక్ష పడిన వారికి క్షమాభిక్ష ప్రసాదించే అవకాశాలు కూడా ఉన్నాయి. కాని ఖతర్‌లో మరణశిక్ష ఎదుర్కుంటున్నవారిని కాపాడ్డానికి రాజకీయాలకు అతీతంగా వెంటనే దౌత్యప్రయత్నాలు ప్రారంభించకుండా తాత్సరం చేయడం చాలా విమర్శలకు తావిస్తోంది. మరోవైపు బీజేపీ నేతలు దేశంలో మతతత్వ రాజకీయాలు మరింత తీవ్రం చేస్తున్నారు. ఖతర్ భౌగోళికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అంతర్జాతీయ వ్యవహారాల్లో తనదైన స్థానం ఉన్న దేశం.భారతదేశంలో రాజకీయాలు, మతతత్వ వ్యాఖ్యలు ఇవన్నీ ఖతర్ కూడా గమనించకుండా ఉండడం జరగదు. దోహా స్పందనను తక్కువగా అంచనా వేయడం మోడీ ప్రభుత్వం చేసిన పొరబాటుగా చాలా మంది భావిస్తున్నారు. దౌత్య సంబంధాలు, విదేశాంగ విధానం వంటి రంగాల్లో మోడీ ప్రభుత్వ సమర్థతపై చాలా మంది ఇప్పుడు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అరబ్ దేశాల నాయకులకు మోడీ వ్యక్తిగతంగా చేరువవుతున్న ప్పటికీ, బీజేపీ నేతల మతతత్వ వ్యాఖ్యల వల్ల తలెత్తే దౌత్య పరిణామాల ప్రభావాన్ని తగ్గించడంలో బీజేపీ పూర్తిగా విఫలమవు తుందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ విధానాల వల్ల ఖతర్లో మరణ శిక్షకు గురయిన వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారవచ్చు. మరోవైపు ఈ ప్రాంతంలోని దేశాలతో మన సంబంధాలు దెబ్బతినే అవకాశాలు కూడా ఉన్నాయి. మరణశిక్ష ఎదుర్కొంటున్న ఎనిమిది మంది, వారి కుటుంబాలు అత్యంత బాధాకరమైన పరిస్థితుల్లో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా దౌత్య విధానాలు ఉండడం దురదృష్టకరమని చాలా మంది భావిస్తున్నారు.

# బీజేపీ నాయకుడి నోటిదురుసు

ఇటీవల రాజస్థాన్‌లోని తిజారాలో బీజేపీ నేత సందీప్ దయామా చేసిన ప్రసంగం తీవ్ర దుమారాన్ని రేపింది. బిజెపి అధికారంలోకి వస్తే మస్జిదులు, గురుద్వారాలు లేకుండా చేస్తామని ఆయన చేసిన ఆ ప్రసంగంలో బాహాటంగా ప్రకటించాడు. ఈ ప్రసంగం తీవ్రమైన మతతత్వ ప్రసంగం, విద్వేష ప్రసంగం. భారతదేశ రాజ్యాంగ సెక్యులర్ విలువలను తుంగల్లో తొక్కే మాటలివి. మతవర్గాల మధ్య చిచ్చుపెట్టే మాటలివి. ఈ విద్వేష ప్రసంగం ఎన్నికల ర్యాలీలో వెలుగులోకి వచ్చింది. ఆ వేదికపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ కూడా ఉన్నాడు. ఆయన మౌనంగా అవన్నీ వినడం అంటే ఆ మాటలను సమర్థించడంగానే చాలామంది విశ్లేషిస్తున్నారు. సందీప్ దయామా తర్వాత తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పినప్పటికీ, మసీదులు, మదర్సాలని చెప్పాడు. గురుద్వారాలను మినహాయించి మాట్లాడాడు. ఈ నాయకుడు చెప్పిన క్షమాపణలోను ఓట్ల రాజకీయాలున్నాయి. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (SGPC) బిజెపి నాయకుడి వ్యాఖ్యలను ఖండించింది, శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు హర్జిందర్ సింగ్ ధామి మాట్లా డుతూ మత వివక్ష లేకుండా అందరికీ సహాయం అందించే 'సర్బత్ ద భలా' సంప్రదాయాన్ని గురుద్వారాలు కొనసా గిస్తున్న విషయం చెప్పారు. సిక్కు బోధనలు, ప్రత్యేకించి శ్రీ గురునానక్ దేవ్ జీ బోధించిన కరుణ, సేవా తత్వాలకు సందీప్ దయమా మాటలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. దయమా, బీజేపీ అగ్ర నాయకత్వం నిర్ద్వంద్వంగా క్షమాపణలు చెప్పాలని సిక్కు నేతలు కోరుతున్నారు. అకాల్ తఖ్త్ మాజీ చీఫ్ గియానీ హర్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ మైనారిటీ వర్గాల భయభీతులకు గురిచేయడమే బీజేపీ విధానంగా విమర్శించారు. మత విభజన పెంచడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. బిజెపి పంజాబ్ నాయకత్వం నుంచి ప్రతిస్పందన లేకపోవడంతో వివాదం మరింత పెరిగింది. సోషల్ మీడియాలో దీనిపై తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ జస్బీర్ సింగ్ గిల్, శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో సహా అనేకమంది ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఒక నాయకుడు ఇలాంటి బాధ్యతారహితమైన మతతత్వ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా నిరసించారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**53 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 42. అష్ షూరా

19 – 20 అల్లాహ్ తన దాసుల పట్ల ఎంతో దయగలవాడు. ఎవరికి ఏది తలచుకుంటే అది ఇచ్చి వేస్తాడు, ఆయన మహాశక్తిమంతుడు, బలాధిక్యుడు.[36] ఎవరయితే పరలోక పంట కోరుకుంటాడో అతని పంటను మేము వృద్ధిపరుస్తాము, మరెవరయితే ప్రపంచ పంటను కోరుకుంటాడో అతనికి ప్రపంచంలో నుంచే ఇచ్చివేస్తాము కాని పరలోకంలో అతనికి ఏ భాగమూ దొరకదు.[37]

36. అంటే, ఆయన ప్రసాదం, అనుగ్రహాల ఈ వ్యవస్థ దాని బలాన అదే వ్యవస్థీకృతమయి ఉంది. దాన్ని మార్చడం ఎవరి తరమూ కాదు. లేదా బలవంతాన దాన్నుండి దేన్నయినా గ్రహించ డానికి లేదా ఎవరికయినా ఇవ్వకుండా ఆపటానికి ఎవరి శక్యమూ కాదు.

37. గత ఆయత్‌లో రెండు వాస్తవాలు సెలవీయబడ్డాయి. వాటిని మనం అన్ని వేళలా అన్ని వైపులా కాంచగలుగుతున్నాము. ఒకటి అల్లాహ్ దయ, ఆయన అనుగ్రహం సర్వసామాన్యమయింది. రెండవది ఆయన అనుగ్రహం, ప్రసాదం, ఉపాధి అందరికీ సమానం కాదు. అందులో వ్యత్యాసం, తారతమ్యం ఉంది. ఇక ఈ ఆయత్‌లో, ఆ దయానుగ్రహాలలో, ఆ ఉపాధి కల్పనలో పాక్షికమయిన వ్యత్యాసాలయితే అనేకమున్నాయి. కాని ఒక ప్రముఖమయిన వ్యత్యాసం సూత్రప్రాయమయింది కూడా ఉంది. అదేమిటంటే, పరలోకాన్ని కోరుకునేవానికి ఒక విధమయిన అనుగ్రహమయితే ప్రపంచాన్ని కాంక్షించేవానికి మరో విధమయిన అనుగ్రహం.

ఇదొక మహత్తరమయిన యదార్థం. దాన్ని అతి క్లుప్తమయిన పదాలలో పేర్కొనడం జరిగింది. దీన్ని పూర్తి వివరాలతో అర్థం చేసుకోవడం అవసరం. ప్రతి మనిషి తన వైఖరిని నిర్ణయించుకునేందుకు ఇది సహాయపడుతుంది.

ఇహం, పరం రెంటి కొరకు కృషిచేసే వారిని ఈ ఆయత్‌లో కృషీవలునితో పోల్చడం జరిగింది. నేలను దున్ని సన్నద్ధం చేయడంతో మొదలెట్టి పంట సిద్ధమయ్యేవరకు నిరంతరం చెమటోడ్చి, ప్రాణాలొడ్డి కష్టపడతాడు. ఈ శ్రమ అంతా ఒకే ఉద్దేశంతో భరిస్తాడు, తన పొలంలో తాను విత్తే గింజలకు పంటను కోయాలని దాని ఫలసాయంతో ప్రయోజనం పొందాలని ఇదంతా చేస్తాడు. కాని సంకల్పం, లక్ష్యాల వ్యత్యాసం వల్లను, చాలామటుకు ఆచరణా వైఖరిలో వ్యత్యాసం చేతను పరలోక పంటను నాటిన రైతుకు, ప్రపంచ పంటను నాటిన రైతుకు మధ్యన మహత్తరమయిన వ్యత్యాసం కానవస్తుంది. అందువల్ల ఉభయుల శ్రమకు ఫలితాలు, ఫలాలు అల్లాహ్ విభిన్నంగా ఏర్పరిచాడు. నిజానికయితే ఉభయులూ కష్టపడే స్థలమయితే ఇదే నేల. పరలోక పంటను పండించే వాని గురించి అల్లాహ్ అతనికి ప్రపంచంలో ఏమీ దొరకదని అనలేదు. ప్రపంచం ఎంతో ఒకింత అతనికి ఎలాగూ ప్రాప్తమయి తీరుతుంది. ఎందుకంటే అల్లాహ్ పరమ ప్రభువు సామాన్య కృపానుగ్రహాలలో అతని వాటా ఉంది. ఉపాధి అయితే మంచివానికీ చెడ్డవానికీ ప్రతి ఒక్కనికీ లభిస్తూనే ఉంది. కాని అల్లాహ్ అతనికి శుభవార్త తెలిపింది ప్రపంచంలో ప్రాప్తమయ్యే విషయం కాదు. అతని పరలోక పంట పెరిగిపోతుందన్న విషయాన్ని వినిపించాడు. ఎందుకంటే అతను దాన్నే కోరుకున్నాడు. దాని పరిణామ ఫలం గురించే అతను చింతిస్తున్నాడు. ఈ పంటను పెంచే పద్ధతులు అనేకమున్నాయి. ఉదాహరణకు, ఏ మేరకు ఇతోధిక సత్సంకల్పంతో అతను పరలోకం కొరకు సదాచరణను ఆచరిస్తూ పోతాడో అతనికి మరింత అధికంగా సత్కార్యాలాచరించే సద్బుద్ధి ప్రాప్తమవుతుంది. అతని ఆంతర్యం సదాచరణకు విప్పారజేయబడుతుంది. పరిశుద్ధమయిన లక్ష్యానికి పరిశుద్ధమయిన సాధనాలను ప్రయోగించాలని అతను సంకల్పించుకున్నప్పుడు అతనికి పరిశుద్ధమయిన మార్గాలలోనే శుభాన్ని, ఆధిక్యాన్ని ప్రసాదించడం జరుగుతుంది. అతనికి సకల ద్వారాలు మూసుకుని కేవలం చెడు ద్వారాలే తెరచుకుని ఉండేటటువంటి పరిస్థితి అల్లాహ్ ఎన్నడూ రానివ్వడు. అన్నింటికీ మించి ప్రపంచంలో అతను చేసిన చిన్నపాటి మంచి పని కూడా పరలోకంలో కనీసం పదివంతులయితే ఎలాగూ పెంచివేయబడుతుంది, మరి ఇంకా అధికంగా పెంచేందుకు పరిమితి అంటూ ఏదీలేదు. వేల వంతులు, లక్షల వంతులు సయితం అల్లాహ్ తాను కోరినవారికి పెంచివేయగలడు.

పోతే, ప్రపంచ పంటను పండించే వ్యక్తి, అంటే పరలోకం కోరుకోని, సర్వం ప్రపంచం కొరకే చేసే వ్యక్తి విషయం, అతని శ్రమకు రెండు ఫలితాలను అల్లాహ్ అతనికి స్పష్టంగా వినిపించాడు. ఒకటి, అతను ఎంతగా వళ్ళు హూనమయినట్లు శ్రమించినా అతను సాధించదలచిన ప్రపంచం అతనికి పూర్తిగా ఎన్నడూ ప్రాప్తం కాదు. దాని ఒక్క భాగం మాత్రమే ప్రాప్తమవుతుంది, అల్లాహ్ అతనికి నిర్ణయించి పెట్టినంత. రెండు, అతనికి దొరికేదేదో కేవలం ప్రపంచంలో మటుకే ప్రాప్తమవుతుంది. పరలోక శుభాలలో అతనికి ఏ వాటా ప్రాప్తం కాదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

**అడుగు జాడలు**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

అధ్యాయం : 7

## మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) విశిష్టత

ఈయన కునీయత్ అబూ హఫ్స్. ఖురైషు తెగకు చెందినవారు.[1]

**323)** మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా అన్నారు: నేను (స్వప్నంలో) స్వర్గంలోనికి ప్రవేశించాను. అక్కడ నేను అబూ తల్హా (రజి) ఇల్లాలు రుమైసా[1]ను చూశాను. ఇంకా నేను ఎవరివో అడుగుల సవ్వడి విన్నాను. ఆయన బిలాల్(రజి) అని (దైవ దూత ద్వారా) తెలిసింది. ఇంకా నేను స్వర్గంలో ఒక మేడను చూశాను. దాని ముందు ఒక స్త్రీ (వుజూ చేస్తూ) కనిపించింది. "ఇది ఎవరి నివాస గృహం?" అని నేను అడిగితే, 'ఉమర్ బిన్ ఖత్తాబ్‌ది' అని (దైవదూత) నాకు చెప్పారు. ఆ మేడ లోపలికి వెళ్ళి చూడాలని నా మనసు ఉబలాటపడింది. "కాని ఉమర్! మీ పౌరుషం నాకు జ్ఞప్తికి వచ్చింది".[2] (ఇది విని) ఉమర్ భోరున ఏడ్చేశారు. '(అయ్యా దైవ ప్రవక్తా!) నా తల్లిదండ్రులు మీకు అర్పితం. మీ పట్ల నాకు పౌరుషమా?[3] అన్నారు.

**327)** తనకు తన తండ్రి (హజ్రత్ సాద్ బిన్ అబీ వక్ఖాస్-రజి) తెలిపారని ముహమ్మద్ బిన్ సాద్ బిన్ అబీ వక్ఖాస్ చెప్పారు: ఇంతకీ ఆయన తెలిపిన విషయమేమంటే, ఒకసారి మహనీయ ఉమర్(రజి) లోనికి రావడానికి దైవప్రవక్త(స) అనుమతి కోరారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) దగ్గర ఖురైషు మహిళలు కొందరు (విశ్వాసుల మాతలు) కూర్చుని మాట్లాడుతున్నారు. వారి కంఠస్వరం దైవ ప్రవక్త(స) కంఠస్వరం కన్నా హెచ్చుగా ఉంది. ఇంటి ఖర్చులు (భరణం) పెంచమని వారు గట్టిగా కోరుతున్నారు. అంతలో వారికి మహనీయ ఉమర్(రజి) కంఠం వినిపించగానే, వారంతా లేచి తెర వెనక్కి పారిపోయారు. ఎట్టకేలకు దైవప్రవక్త(స) ఆనతిపై ఉమర్(రజి) లోనికి వచ్చారు. చిరునవ్వు చిందిస్తున్న దైవప్రవక్త(స)ను చూసి, 'యా రసూలల్లాహ్! అల్లాహ్ మిమ్మల్ని సదా సంతోషంగానే ఉంచుగాక! ఇంతకీ తమరి చిరునవ్వుకు గల కారణం ఏమిటో తెలుసుకోవచ్చా' అని అడగ్గా, "నాకు వీళ్ళ ధోరణిపై నవ్వొచ్చింది. వీరు ఇప్పటివరకూ నా దగ్గరే కూర్చుని ఉన్నారు. కాని మీ కంఠస్వరం వినగానే అందరూ (భయపడి) తెరవెనక్కి తుర్రుమన్నార"ని దైవప్రవక్త(స) చెప్పారు. దానికి హజ్రత్ ఉమర్(రజి), 'దైవప్రవక్తా! వారసలు భయపడాల్సింది నాకు కాదు, మీకు' అన్నారు. ఆ తర్వాత (ఆ మహిళల నుద్దేశించి) 'ఓయీ ఆత్మ విరోధులారా! మీరు నాకు భయపడుతున్నారుగాని దైవప్రవక్త(స)కు భయపడటం లేదా?' అని ప్రశ్నించగా, 'అవును, మీరు చెప్పేది నిజమే. కాని దైవప్రవక్త(స)తో పోల్చుకున్నప్పుడు మీరు ఎక్కువ కఠినులు' అని విశ్వాసుల మాతలు సమాధానమిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఖత్తాబ్ పుత్రుడా! ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ఏ దారిలోనయినా మీరు షైతాన్‌కు ఎదురుపడితే, వాడు ఆ దారిని వదిలేసి మరో దారి గుండా వెళ్ళిపోతాడు."

7-1. 'ఫారూఖ్' అనేది ఈయన బిరుదు. దైవప్రవక్త(స) ఇచ్చిన బిరుదు ఇది. అది జిబ్రీల్ (అలైహిస్సలామ్) తీసుకువచ్చిన బిరుదు అని మరికొంత మంది అభిప్రాయపడ్డారు. న్యాయం, దూరదృష్టి, పరిపాలనా దక్షతలో సాటిలేని మేటి. ఈయన జీవిత చరిత్రపై ప్రపంచంలోని ఎన్నో భాషలలో పెద్దపెద్ద పుస్తకాలు వెలువడ్డాయి.

323-1. ఈమె హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తల్లి ఉమ్మె సులైమ్. 'రుమైసా' అనేది ఆమె బిరుదు. కళ్ళలోని పుసిని రుమైస్ అంటారు. ఆమె కళ్ళలో పుసి ఎక్కువగా కనిపించేది. అందువల్ల జనులు ఆమెను 'రుమైసా' అని పిలిచేవారు.

323-2. అందుకే తక్షణం నేను అక్కడి నుండి వెనుతిరిగాను.

323-3. అయ్యా దైవప్రవక్తా! మేము మీ బానిసలం. ఈనాడు మాకు లభించిన ఈ గౌరవం మీ మూలంగానే కదా! స్వర్గమెక్కడ? మేమెక్కడా? మేము స్వర్గ సువాసనను కూడా ఆఘ్రాణించలేము. మార్గభ్రష్టులుగా ఉన్న మాకు మీరు సన్మార్గం చూపి, స్వర్గలోక శుభవార్త వినిపించారు. అన్యథా మేము ఈ ప్రపంచంలో దౌర్భాగ్యులుగానే జీవించి, పరలోకంలో స్వర్గానికి దూరమయ్యే వారము అన్నది ఉమర్(రజి) పలుకులోని అంతరార్థం.



# ఇస్లామ్ ప్రవక్త (స) రాకకు పూర్వం అరేబియాలో బహుదైవారాధన

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## విగ్రహారాధన

అరబ్బులు కొలిచే దేవుళ్ళ విగ్రహాలు ఆనాడు తయారు చేయబడేవి. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద విగ్రహాలయాలు వెలిసేవి. ఎక్కడయినా ఒక అందమైన రాయి కనిపిస్తే చాలు, దానిని తెచ్చి పూజించ సాగేవారు. మరి దానికన్నా అందమైనది దొరికితే మొదటి దానిని పారవేసి కొత్తదానికే మొక్కేవారు. ఒకవేళ రాయి దొరక్కపోతే మట్టితో బొమ్మను తయారుచేసి, మేకపాలతో దానిని అభిషేకం చేసి, దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. ఆ రోజు నుంచీ అదొక దైవమై కూర్చునేది. సహీహ్ బుఖారీ, అల్ గాజీ ప్రకరణంలోని బనీ హునైఫా బృంద అధ్యాయంలో ఈ వివరాలన్నీ ఉన్నాయి.

ఇంతకీ అరబ్బులలో విగ్రహారాధన ఎలా మొదలయ్యిందంటే ఖుజాఅ తెగకు చెందిన అమ్ర్ బిన్ లుహ్యా అనే వ్యక్తి జుర్హుం తెగ వారిని ఓడించి 'కాబా' ధర్మకర్త అయ్యాడు. అతను ఒకసారి బల్ఖా వెళ్ళాడు. అక్కడి ప్రజలు విగ్రహారాధన చేయటం చూసి ప్రభావితు డయ్యాడు. వస్తూ వస్తూ అక్కడి నుండి ఒక విగ్రహం తీసుకువచ్చి పవిత్ర కాబా గృహంలో ప్రతిష్ఠించాడు. అప్పటికే అతను అరేబియాలో ప్రఖ్యాతిగాంచిన నాయకుడవటం చేత సామాన్య అరబ్బులు అతని అడుగుజాడలలో నడుచుకుంటూ విగ్రహారాధన చేయటం మొదలెట్టారు. ఇంటింటా చిల్లర దేవుళ్ళు వెలిశారు. వాటిలో అతి పెద్ద దేవత హుబల్. ఆ తరువాత మనాత్, లాత్, ఉజ్జాల వంతు వస్తుంది.

మనాత్ విగ్రహం మదీనా మునవ్వరాకు ఏడు మైళ్ళ దూరాన ఉండేది. అన్సార్ తెగలైన ఔస్, ఖజ్రజ్‌లు ఆ పరిసర ప్రాంతాలలో ఉండే మరితర తెగలవారు ఇక్కడికే వచ్చి 'హజ్' చేసేవారు. కాబా గృహ హజ్జ్ చేసినప్పుడు కూడా వారు ఇక్కడికే వచ్చి ఇహ్రామ్ దీక్షను విరమించేవారు. ప్రమాణ స్వీకారాలు చేయాలన్నా, ఒడంబడికలు చేసుకోవాలన్నా వారు ఇక్కడికే వచ్చేవారు. అబ్దుల్ ఉజ్జా ముజనీ ఇలా అంటున్నాడు –

ఖజ్రజ్ తెగవారు 'ఇహ్రామ్' విడిచే స్థలంలో నేను 'మనాత్' దేవత మీద నిజమైన ప్రమాణం చేశాను.

సఖీఫ్ తెగవారి ఇలవేలుపు 'లాత్'. ఈ విగ్రహం తాయఫ్‌లో ప్రతిష్ఠించబడి ఉండేది. తాయఫ్ ప్రజలు దీనిని కాబా గృహానికి సమానమైనదిగా భావించేవారు.

'ఉజ్జా' అనేది ఒక వృక్షం. ఆ వృక్షం వద్ద ఒక విగ్రహం ఉండేది. అది గత్ఫాన్ తెగవారి ఇలవేలుపు. అయితే ఖురైషులు కూడా దానిపట్ల భక్తిశ్రద్ధలు కలిగి ఉండేవారు. ఈ విగ్రహాన్ని తరచూ సందర్శిస్తూ ఉండేవారు. ఖురైషులు కాబా గృహ ప్రదక్షిణ చేసే సమయంలో ఇలా పఠించేవారు –

లాత్, ఉజ్జా, మూడవదైన మనాత్ – ఇవి ఎంతో పునీతమైనవి.

దైవ సన్నిధిలో వీరి సిఫారసు స్వీకారయోగ్యమవుతుందని ఆశించబడేది.

విగ్రహారాధన క్రమక్రమంగా ఎన్నో చెడుగులను పుట్టించింది. జంతుబలితో సంతృప్తి చెందక, నరబలులను కూడా సమర్పించుకునేవారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) తాతగారైన అబ్దుల్ ముత్తలిబ్ తన కన్న కొడుకు అబ్దుల్లాహ్‌ను సైతం బలి ఇవ్వడానికి సిద్ధపడిన సంగతి తెలిసిందే.

బహీరా, సాయిబా, హామ్‌ల పేరుతో విగ్రహాల పేరిట అచ్చోసిన జంతువులను వదిలేవారు. కాబా పవిత్ర గృహం ముందు పశువుల ఖుర్బానీ ఇచ్చి, వాటి రక్తాన్ని కాబా గోడలకు పూసేవారు. విగ్రహాల ముందు శకునాల బాణాలు ఉండేవి. వాటిలో ఒక దానిపై 'అవును' అనీ, మరొక దానిపై 'కాదు' అనీ వ్రాయబడి ఉండేది. ఏదైనా పని చేయదలచినప్పుడు బాణాలు విసరమని పూజారిని కోరేవారు. 'అవును' అని వస్తే ఆ పని చేసేవారు. 'కాదు' అని వస్తే ఆ పనిని మానుకునేవారు.

అజ్ఞాన స్థితిలో వారు చేసే పూజలు వివిధ రకాలుగా ఉండేవి. విగ్రహాలు కూడా పలురకాలుగా ఉండేవి. కొన్ని విగ్రహాలు మానవాకారంలో ఉండేవి. వాటిని నిలబెట్టి, వాటి ముందర జంతుబలి ఇచ్చేవారు.

కాబా గృహం చుట్టూ 360 విగ్రహాలుండేవి (బుఖారీ – మక్కా విజయం అధ్యాయం). వాటిలో కొన్నిపేర్లు ఖుర్ఆన్‌లో పేర్కొనబడ్డాయి. అవేమంటే (1) లాత్ (2) ఉజ్జా (3) మనాత్ (4) యగూస్ (5) యవూఖ్ (6) నస్ర్ (7)వద్ద్ (8)సువా (9) బాల్. అయితే అజ్ఞానకాలపు పురాతన చరిత్రకారులు, నిఘంటుకర్తలు అజ్ఞాన కాలపు మరిన్ని పేర్లను ప్రస్తావించారు. హిష్షామ్ కల్బీ వ్రాసిన గ్రంథం "అస్నాం"లో దాదాపు 30 విగ్రహాల పేర్లున్నాయి. అయితే అల్లామా జకీపాషా క్రీ.శ. 1924లో కల్బీ వ్రాసిన ఈ గ్రంథాన్ని ప్రచురించినప్పుడు మరికొన్ని పేర్లు కూడా అదనంగా ఉన్నాయి.

క్రింద మేము ఇప్పటి వరకు మాకు తెలిసిన ఆ విగ్రహాల పట్టికను పొందుపరుస్తున్నాము –

| విగ్రహాల పేర్లు | వాటిని పూజించే తెగల పేర్లు |
|---|---|
| **లాత్** | సఖీఫ్ తెగ |
| **ఉజ్జా** | ఖురైషులు, బనూ షైబాన్ బిన్ జాబిర్ |
| **మనాత్** | ఔస్, ఖజ్రజ్, ఇతర సామాన్య అరబ్బులు |
| **యగూస్** | బనూ ముద్లజ్, అహ్లె జర్ష్ |
| **యవూఖ్** | బనూ హమదాన్, ఖైవాన్ |
| **నస్ర్** | హుమైర్ |
| **వద్ద్** | బనూ కల్బ్ |
| **సువా** | బనూ లుహ్యాన్ |
| **అసాఫ్** | ఇదొక విగ్రహం, హజ్జ్‌లో దీని పేరిట |
| | ఖుర్బానీ ఇవ్వబడేది. |
| **నాయిలా** | ఇదీ ఒక విగ్రహమే. దీని పేరు మీద కూడా |
| | హజ్జ్‌లో ఖుర్బానీ ఇవ్వబడేది |
| **అఖ్‌సీర్** | ఖుజాఅ, లఖమ్, జజామ్, ఆమిలా, ఇత్ఫాన్ తెగలు |
| **బాజర్** | అజ్‌దూతీ, ఖుజాఅ |
| **జుల్‌ఖుల్సా** | బనూ ఉమామా, ఖషమ్, బజాలా |
| **రుజా లేదా రజీ** | బనూ రబీయ విగ్రహాలయం |
| **రుమామ్** | హుమైర్ విగ్రహాలయం |
| **సాద్** | బనీ లుకాన్ బిన్ లుమానా |
| **సయీర్** | ఉజైరా |
| **జుల్‌షరా** | బనూ హారిస్ |
| **ఆయిమ్** | అజ్దుల్ సిరా |
| **ఉమ్మె అనస్** | ఖౌలాన్ |
| **ఖలస్** | తై |
| **జుల్ కఫీన్** | బనూ దౌస్ |
| **మనాఫ్** | ఖురైష్ |
| **నహమ్** | ముజైనా |
| **హుబల్** | ఖురైష్ |
| **బాల్** | బనీ అద్నాన్ తెగలు |
| **ఖుయూబ్** | హుదైలా (బనీ తై) |
| **అష్‌హల్** | బనూ అబ్దుష్షహల్ |
| **అవాల్** | బకర్, తగ్‌లబ్ |
| **లబస్** | గత్ఫాన్ తెగవారి విగ్రహాలయం |
| **బయామ్** | ఒక కొయ్య విగ్రహం |
| **బల్జ్** | ఒక విగ్రహం |
| **జురైష్ లేదా** | ఇదొక విగ్రహం, అబ్దె జురైష్ తెగవారు |
| **హురైష్** | దీనిని పూజించేవారు |
| **జల్సద్** | ఇదొక విగ్రహం పేరు |

| | |
|---|---|
| **జహోర్** | హవాజిన్ తెగవారి ఆరాధ్య దైవం |
| **దార్** | బనూ అబ్దుద్దార్ |
| **దవార్** | ఒక విగ్రహం పేరు |
| **జుల్ రజుల్** | హిజాజ్ ప్రాంతంలోని ఒక విగ్రహం పేరు |
| **షారిఖ్** | ఇదొక విగ్రహం పేరు. అబ్దుష్షారిఖ్ తెగవారితో దీనికి సంబంధం ఉంది. |
| **షమ్స్** | బనూ అబ్దె షమ్స్ |
| **సదా** | ఆద్ జాతివారి విగ్రహం |
| **సమూదా** | ఇదీ ఆద్ విగ్రహమే |
| **జమార్** | అబ్బాస్ బిన్ మర్దాస్ సులమీ తెగ |
| **జైజన్** | ముజ్జిర్ అక్బర్ |
| **అబ్ అబ్** | ఖుజాఅ |
| **ఔజ్** | బకర్ బిన్ వాయల్ |
| **ఔఫ్** | ఒక విగ్రహం పేరు |
| **ఫరాజ్** | సాదుల్ అషీరా |
| **క్రసా** | జుదైస్, తిస్మ్ |
| **కస్ఆ** | ఇదొక విగ్రహం పేరు |
| **మ్రఖ్** | బకర్ బిన్ వాయల్ |
| **మదాన్** | అబ్దుల్ మదాన్ |
| **మర్‌హబ్** | హజర్‌మోత్ |
| **మన్‌హబ్** | ఒక విగ్రహం పేరు |
| **హబా** | ఆద్ |
| **జాతుల్ వదా** | ఒక విగ్రహం పేరు |
| **యాలైల్** | అబ్దె యాలైల్ |
| **గబ్ గబ్** | ఇక్కడ పశువులు కోయబడేవి |

*(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వి–రహ్మా– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)*

**(మిగతా వచ్చే సంచికలో)**

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# కొత్త తునకలు-4

**- ఎస్.ఎమ్. మలిక్**

**7)** ఎన్నటికీ నిను ఖాతరు చేయను
నా మార్గం, గమ్యం ఏమీ కావు!
క్షణంలో విలిచితం చేసిపోయిన
బిందు ప్రాయపు ఓ కుదుపువు!!

**8)** ప్రమాదం పొంచి ఉందని వింటేనే
మనమందరం ఏకమవుదామా?
ఏకమయ్యే కారణాలు ఎన్నోలేవు
దైవాదేశం ఒక్కటే చాలు మనకు!

**9)** కవిని కానని ఎంత మొరపెట్టుకున్నా వినరు
ఉబుసుపోక వ్రాసినవన్నీ నను
చుట్టేసుకుని అదే పనిగా వాపోతున్నాయి
నీవు కాదంటే మా గతేమిటీ అని!

**10)** నల్లవారు, తెల్లవారు, అమెరికన్లు, చైనీయులు
ఆర్యులు, ద్రావిడులూ అన్యులు!
ఒక్కటయిన మానవాళి చిందువందయిపోయింది
భిన్న భిన్న జాతులుగా మారింది!!

**11)** శక్తి కొరకు బాహ్యంలో అన్వేషణాయాగమా
ఆంతర్యంలో వెతికి చూశావా?
నీ లోని బలహీనతలేమిటో తెలుసుకోవడమే
నీ మహత్తరమయిన బలిమి!

**12)** జ్ఞాపకాలు, అనంతమయినవి అగాధమయినవి
ప్రేమానురాగాల వలె
అనంత శూన్యమయినవి దిగంత దూరమయినవీ
విశ్వాంతర ప్రేమ వలె!

# శ్రమించే వారినే అల్లాహ్ ప్రేమిస్తాడు

- ముహమ్మద్ వహీదుద్దీన్

**జీవితం**లో శ్రమకు చాలా గొప్పదనం, మహత్యం ఉంది. శ్రమించకుండా మన జీవితంలో అభివృద్ధి సాధ్యపడదు. శ్రమ వికాసానికి వెన్నెముక. ఈరోజు మనం ప్రపంచంలో మానవుల ద్వారా ఎటువంటి వికాసాన్ని చూస్తున్నామో అది మానవ జాతి ఇంకా శ్రమ పరిణామమే. అల్లాహ్ ప్రసాదించిన జ్ఞానంతో ముందుకు అతివేగంగా దూసుకుపోతున్నాడు.

ప్రకృతి ప్రతి కదలికలోనూ శ్రమించాలనే సందేశం దాగి వుంది. చిన్న చీమ తన ఆహారం కోసం దూరం వెళ్లి ఆహారాన్ని సమకూర్చుకుంటుంది. ఎంతగానో శ్రమిస్తుంది. తేనెటీగలు తేనె సమకూర్చడం కోసం ఒక పువ్వు నుండి రెండవ పువ్వు మీద వాలతాయి. ఎంతో శ్రమించి తేనెను తయారు చేస్తాయి. శ్రమ అభివృద్ధికి ఆధారం. ఇది మన భాగ్య నిర్మాత. అందువల్ల మనం ఎల్లప్పుడూ శ్రమించాలి. శ్రమించేవారు ఎప్పటికి ఓటమి పొందరు. విజయం వారి పాదాలను తాకుతుంది.

ఒక మనిషి చాలా రోజులు కష్టపడి తినే ఆహారం, వస్తువులు కొని తన ఒంటెపై తన ఇంటికి బయలుదేరుతాడు. మధ్యలో ఎడారి వస్తుంది. ఎంతో అలసిపోతాడు. ఒక చెట్టు కింద కూర్చొని నిద్రలోకి జారిపోతాడు. కొద్దిసేపటికి కళ్లు తెరిచి చూసేసరికి ఒంటె కనిపించదు. తినే ఆహారం, వస్తువులన్నీ ఒంటెపైనే ఉన్నాయి.

ఎడారిలో తిరగడం ప్రారంభిస్తాడు. ఎక్కడ కూడా ఒంటె కనబడదు. తిరిగి తిరిగి ఎండలో అలసిపోయి మళ్ళీ అదే చెట్టు కింద కూర్చుంటాడు. విపరీతమైన ఆకలి, దాహం కలుగుతుంది. నేను చివరి ఘడియలో ఉన్నాను. మృత్యువు రాక తప్పదు అని అనుకుని అల్లాహ్‌తో దుఆ చేస్తూ నా అంతిమ సంస్కారాలు చేసే ఏర్పాటు చేయడానికి ఎవరికైనా పంపించు అంటూ సాష్టాంగ పడిపోయాడు.

కొద్దిసేపటికి లేచి చూసేసరికి ఎదురుగా ఒంటె సామానుతో సహా నిలబడి ఉంటుంది. సంతోషంతో దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ మళ్లీ సాష్టాంగ పడిపోతాడు.

కష్టంతో పనిచేసే హలాల్ సంపాదన ఎప్పటికీ వృథాపోదు. అల్లాహ్ దానిని రక్షిస్తాడు. అల్లాహ్ కష్టం చేసి సంపాదించే వానినే ఎక్కువగా ప్రేమిస్తాడు.

ఒకసారి దైవప్రవక్త(స) దగ్గరికి ఒక వ్యక్తి వచ్చి నా దగ్గర తినడానికి ఏమీ లేదు. ఏదైనా ఉంటే సహాయం చేయండి అన్నాడు. అతను చూస్తే ఆరోగ్యంగా, బాగానే ఉన్నాడు. దైవ ప్రవక్త(స) అతనితో నీవు అడవికి వెళ్ళి కట్టెలు ఏరుకుని ఒక కట్ట కట్టి తీసుకుని రా అని అన్నారు. అతను అలాగే చేశాడు. దీనిని తీసుకొని మార్కెట్‌లో అమ్మి వచ్చిన డబ్బుతో ఒక గొడ్డలి కొనుక్కో. రోజూ అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి అమ్ముకో. భార్యాపిల్లలను మంచిగా చూసుకో. కష్టించే తత్వం నీలో ఏర్పడుతుంది. డబ్బులు ఏమిటో, జీవితం ఏమిటో నీకు తెలుస్తుంది అంటూ హితబోధ చేశారు దైవప్రవక్త(స).

దైవప్రవక్త ముహమ్మద్(స) చెప్పిన విధంగా చేశాడు. కొన్ని నెలలోనే అతను ఆర్థికంగా ఎంతో ఎదిగాడు. మళ్ళీ అతను దైవప్రవక్త(స) దగ్గరికి వచ్చి కష్టించి పని చేసి హలాల్ సంపాదిస్తే ఎంతో ఆత్మ తృప్తి కలుగుతుందని చెప్పి అల్లాహ్‌తో దుఆ చేస్తూ సాష్టాంగంలో పడిపోతాడు.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# యుద్ధం అంతమవ్వాలి శాంతి పరిఢవిల్లాలి

**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**ముఖ్యంగా ఆయన విశ్వాసుల హృదయాలను పరస్పరం కలిపి నీకు కొండంత ధైర్యాన్నిచ్చాడు. నీవు ప్రపంచంలోని సంపద మొత్తం ఖర్చుపెట్టినా వారి హృదయాలను కలపలేవు. వారి హృదయాలను కలిపేవాడు అల్లాహ్ మాత్రమే. నిస్సందేహంగా ఆయన అపార శక్తి సంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. ప్రవక్తా! నిన్ను, నీ అనుచరులైన విశ్వాసుల్ని ఆదుకోవడానికి ఆ ఒక్క అల్లాహ్‌యే చాలు. (అంఫాల్: 63-64)**

మీకు గుర్తుందా... గుర్తు ఉండే ఉంటుందని అనుకుంటాను.. రెండో ప్రపంచ యుద్ధంలో షిరోషిమా, నాగసాకి మీద అమెరికా అణుబాంబులు వేసింది. ఇప్పటికీ అక్కడ పచ్చగడ్డి కూడా మొలవడం లేదు. ఇరాన్, ఇరాక్‌పై అమెరికా యుద్ధం చేస్తే ఇప్పటికీ అక్కడ శిథిలాలు తప్ప మరేవీ కన్పించడం లేదు. బెంజిమిన్ ఫ్రాంక్లిన్ అన్నట్టు 'మంచి యుద్ధం.. చెడ్డ శాంతి ఉండవు' దేశాధినేతలు ఇవి గుర్తెరగకపోవడం వల్లే యుద్ధాలు జరుగుతున్నాయి. చివరకు కన్నీళ్లు కూడా మిగలడం లేదు. బాంబుల ధాటికి అభివృద్ధి ఆనవాళ్లు కాలగర్భంలో కలిసి పోతున్నాయి. నిర్మించిన భవనాలు, ఇళ్లు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ భస్మీపటలమవుతున్నాయి. సామ్రాజ్య వాదం, రాజ్య విస్తరణ కాంక్ష, నిలువెత్తు అహంభావం, దోచుకోవాలనే తాపత్రయం, ప్రపంచాన్ని శాసించాలనే కుటిల బుద్ధి వంటి కారణాలు యుద్ధానికి దారి తీస్తున్నాయి. నాటి నాజీల నుంచి నేటి పుతిన్, ఫలస్తీనలోని అక్రమార్కులయిన యూదుల వరకు ఇదే జరుగుతోంది.

"నరహత్య చెయ్యవద్దు" "దొంగలింపవద్దు" అన్నవి యూదులు చదివే "తోరా" గ్రంథపు "పది ఆజ్ఞల"లోని రెండు ప్రధాన ఆజ్ఞలు. ఈ రెండింటికీ వ్యతిరేకంగా పాలస్తీనా భూభాగంలో యూదులు నరహత్య చేసి, భూములు దొంగలించి సభ్య ప్రపంచానికి ఏం సందేశం ఇస్తున్నట్టు?

ఒకరు చేసిన దాడికి ఎదురుదాడి అంటున్నారు. ఎంత మాత్రం కాదు. గత డిసెంబర్ నుంచి ఇజ్రాయిల్ నిరంతరం దాడులు చేస్తోంది. ఒక్క వెస్ట్ బ్యాంక్‌లోనే 260 మంది చనిపోయారు. అల్ అక్సా మసీదుపై ప్రతి రోజూ దాడులు జరుగుతున్నాయి. అల్-అక్సా మసీదులో పాలస్తీనా మహిళలతో ఇజ్రాయిల్ సైనికులు ఎలా ప్రవర్తించారో అందరూ చూశారు. పాలస్తీనా భూమి ప్రతి రోజూ ఆక్రమణకు గురవుతోంది. పాలస్తీనియన్లు ప్రతి రాత్రి అరెస్టు చేయబడుతున్నారు. ఇజ్రాయిల్ జైళ్లలో దాదాపు 5,000 మంది పాలస్తీనా ఖైదీలు ఉన్నారు. ఈ పరిస్థితి ఒక్క గాజాలోనే కాదు. ఇది వెస్ట్ బ్యాంక్‌లోనూ వున్నది. పాలస్తీనా ప్రజలు ప్రపంచంలోనే అత్యంత దారుణమైన దురాక్రమణను ఎదుర్కొంటున్నారు.

మానవాళి పట్ల, ప్రపంచం పట్ల బాధ్యత ఉన్న వారెవ్వరైనా ఈ తరహా హింసాకాండను సమర్థించరు. కానీ, ఇంత దారుణ హింసాకాండ తరువాత కూడా ఇజ్రాయిల్‌ను బైడెన్ వెనకేసుకు రావడంతో అమెరికా దుర్నీతి మరోసారి ప్రపంచానికి వెల్లడైంది.

ఒకప్పుడు యుద్ధం గెలవడం కోసం ఆయుధాలు తయారు చేసేవారు. మరిప్పుడు ... ఆయుధ అమ్మకం కోసం యుద్ధాలు సృష్టిస్తున్నారు. యుద్ధానికీ, శాంతికీ మధ్య మనిషి చక్రభ్రమణం నిరంతరాయంగా సాగుతూనే ఉంది. యుద్ధమే ప్రధానమై శాంతి ఎంత అప్రధానమైందంటే, రెండు యుద్ధాల మధ్య తాత్కాలిక విరామాన్నే శాంతిగా నిర్వచించుకునే పరిస్థితికి వచ్చాం. శాంతికాలంలో యుద్ధాన్ని జపించడం, యుద్ధకాలంలో శాంతిని స్మరించడం మనిషికి పరిపాటిగా మారింది. యుద్ధం కడుపున శాంతి శిశువును, శాంతి కడుపున యుద్ధ శిశువును కోరుకోవడమూ అంతే నిత్య సత్యమైంది.

యుద్ధమొచ్చి శాంతిని చెదరగొడుతున్నట్టు భ్రమిస్తాం కానీ వాస్తవానికి శాంతే మధ్య మధ్య వీచే మలయమారుతమై ప్రచండమైన యుద్ధం వేడిగాల్పులకు అవరోధమవుతోందన్న ఎరుక మనకు లేదు. యుద్ధమే అక్కడ శాశ్వతంగా తిష్ఠవేసిన చుట్టమైంది. శాంతి ఎప్పుడైనా తొంగిచూసే అతిథి మాత్రమైంది.

ఏ యుద్ధం అయినా చివరిలో అయినవారిని కోల్పోయిన తల్లులు, భార్యల దుఃఖారావాలూ, అర్తనాదాలూ గుండెల్ని పిండివేస్తాయి. అన్ని అనుభవాలున్నా, అన్నిన్ని శోకసముద్రాలు కట్టలు తెంచుకున్న ఉదాహరణలు కళ్ళముందున్నా మనిషిలో యుద్ధోన్మాదం ఉపశమించలేదు. సమర మోహం తీరలేదు. రుధిరదాహం చల్లారలేదు. శాంతియుతంగా జీవించడం మనిషి ఇప్పటికీ నేర్చు కోలేదు. యుద్ధంలో చివరికి అటూ అటూ విజేతలే ఉండరనీ. మిగిలేవి శవాలూ, జీవచ్ఛవాలు మాత్రమేనన్న సత్యాన్ని మనిషి ఇప్పటికీ అర్థం కోలేదు. చావు దిశగా ఈ చీకటి ప్రస్థానం ఎంతకాలం?! ఇంకెంత కాలం? ఏ యుద్ధంలోనైనా తర్వాత మనిషి తినేది వట్టి కూడు కాదు, అక్షరాలా 'నెత్తురుకూడు'.

కత్తి పట్టి యుద్ధం చేసేది వినాశానానికి కాదు..కొత్త చరిత్ర లిఖించేందుకు అంటారు కొందరు. కానీ కత్తి వల్ల జరిగిన యుద్ధాలు, బాంబుల వల్ల జరిగిన యుద్ధాలు వినాశాన్ని తప్ప కొత్త చరిత్ర లిఖించిన దాఖలాలు ఈ భూమండలం మీద లేవు. రగిలే కాంక్ష, చెలరేగే కత్తి, రివ్వును దూసుకొచ్చే బాంబు, చిందే నెత్తురు సువర్ణాధ్యాయాలను లిఖించిన దాఖలాలు ఇప్పటి వరకూ లేవు. రావు.

ప్రపంచ పటంలో ఆ నేల విస్తీర్ణం- సూదిమొన మోపినంతః జనగణనను ఆరంభిస్తే, ఆ జాతి జనాభా కొద్ది రోజుల్లోనే తేలిపోయేంత! అయితేనేం, వందల ఏళ్లుగా మొత్తం ప్రపంచ ఆలోచనా విధానాన్నే ప్రభావితం చేస్తున్న మహనీయులైన ఎందరో శాస్త్ర సాంకేతిక ప్రతిభావంతులకు, రాజనీతిజ్ఞులకు, మత ప్రవక్తలకు జాతిపరంగా ఆ నేల అమ్మ పేగుగా నిలిచింది. ప్రపంచానికి వెలుగులు పంచింది. కొత్త ఆలోచనలకు దారులు పరిచింది. విశ్వాన్ని తనవైపు విస్మయంగా పరికించేలా చేసింది. ఆ నేలను ఈవేళ యుద్ధ వాతావరణం కమ్ముకొంది. ఆ నేల నలుచెరగులా ఉన్మాదం, కిరాతకంగా ఉరుముతోంది. ఇళ్లు నేలమట్టం అవుతున్నాయి. ప్రజలు కకావికలమవుతున్నారు.

ఆ గడ్డ నెత్తురోడుతోంది. ఆ మట్టి కన్నీటి ప్రవాహాల్లో తడుస్తోంది. ఆ శిధిలాల గుట్టల్లోంచి, ఆ శవాలు గుంపుల్లోంచి రోదిస్తున్న మానవ చరిత్ర సన్నని స్వరం- ప్రళయ భీకర యుద్ధ ఘోషలో అణగారిపోతోంది. ఆధునిక యుగాల్లోని యుద్ధ పరిణామాలు ఆ రెండు దేశాలకే పరిమితం కావెన్నడూ! రణక్షేత్రాలు రక్తంతో మెరిస్తే- తక్కినవన్నీ కన్నీళ్లతో తడుస్తాయి. ఇది మసిచరిత్ర. జ్ఞాన ధరిత్రి దీన చరిత్ర.

మారణాయుధాలు మానవతా సంక్షోభాలను సృష్టిస్తాయే తప్ప సామరస్యాన్ని నెలకొల్పలేవు. అమాయకుల నెత్తుటితో నిత్యం తడిసిముద్దయ్యే నేలలో శాంతికి స్థానముండదు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం- ప్రస్తుతం పశ్చిమాసియాను పట్టి కుదిపేస్తున్న యుద్ధోన్మాదమే. 'గాజా ప్రజలపై మేము యుద్ధం చేయట్లేదు' అంటూనే చిన్నారులూ మహిళలతో పాటు ఎందరో అసహాయులను ఇజ్రాయెల్ దళాలు పొట్టన పెట్టుకుంటున్నాయి. ప్రాణాలు కాపాడుకోవాలనుకుంటే 24గంటల్లో ఉత్తర గాజాను ఖాళీ చేయాలంటూ పదకొండు లక్షల మంది మెడపై అవి కత్తి పెట్టాయి. సామాన్యులను దుర్భరావస్థల పాల్జేశాయి.

దట్టంగా పరచుకొన్న యుద్ధమేఘాలకు ఆజ్యం పోసిందెవరు? డిసెంబరు 2022లో మరోసారి ఇజ్రాయెల్ అధికార పీఠాన్ని బెంజమిన్ నెతన్యాహు అధిష్ఠించారు. ప్రధానమంత్రి పదవి కోసం పరమ అతివాద పార్టీలతో జతకట్టిన ఆయన- స్వదేశ చరిత్రలోనే అత్యంత మతఛాందస ప్రభుత్వాన్ని కొలువు తీర్చారు. పాలస్తీనియన్ల పొడను చీదరించుకునే జాత్యహంకారులకు మంత్రి పదవులిచ్చారు. వారి అండదండలతో వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలెమ్‌లో ఇజ్రాయెలీ సెటిలర్లు అడ్డూ అపూ లేకుండా రెచ్చిపోయారు. మొన్న జూన్లోనే పాలస్తీనియన్లపై వాళ్లు 310 దాడులకు (ఇళ్లు తగలబెట్టడం వంటివి) తెగబడ్డారు. ఈ ఏడాది మొదటి ఆర్నెల్లలో వెస్ట్ బ్యాండ్‌లోనే రెండొందల మంది పాలస్తీనియన్లను చంపేశారు. యూదు జాతివాదంలోంచి బుసలుకొడుతున్న ప్రమాదకర ఉగ్రవాదంగా దీన్ని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నేత బెన్నీ గాంట్జ్ సైతం ఛీత్కరించారు.

వివరాల్లోకి వెళితే...

సరిగ్గా వంద సంవత్సరాల క్రితం మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయం. నవంబర్ 2, 1917 న అప్పటి బ్రిటిష్ ప్రభుత్వపు విదేశాంగ మంత్రి 'ఆర్థర్ బాల్ఫోర్' బ్రిటిష్ యూద వర్గానికి చెందిన ప్రముఖుడైన 'లియోనెల్ వాల్టర్ రూత్స్ చైల్డ్'కు 67 అక్షరాలతో కూడిన ఒక 'ఉత్తరం' రాశాడు.

అప్పటివరకూ పాలస్తీనాలో ప్రశాంత జీవనం గడుపుతూ వస్తున్న ముస్లిములకు తెలీదు. ఆ ఉత్తరం ద్వారా వారి జీవితాలు ఛిద్రం చేయ్యబడి, భవిష్యత్తులో వారి రక్తంతో తడిచిన నేలపైనే మరో దేశం నిర్మించబడుతుందని, తాము స్వతంత్రంగా నివసించిన భూమే తమ కోసం ఓ డెటెన్షన్ క్యాంప్‌గా మారబోతుం దని, తమ ఇళ్లు కూల్చబడి తమ భూములు లాక్కోబడతాయని, రాబోయే రోజుల్లో ఓ భయంకరమైన రక్తచరిత్ర సృష్టించబడు తుందని.

ఆ ఉత్తరం సారాంశం ఏమిటంటే- బ్రిటిష్ ప్రభుత్వం యూదుల కోసం పాలస్తీనా భూభాగంలో ఒక స్వంత దేశాన్ని నిర్మించి ఇవ్వటానికి నిర్ణయం తీసుకుందన్నది. ఆ ఉత్తరం పేరే- 'బాల్ఫోర్ డిక్లరేషన్'.

కేవలం 1947 నుండి 1949 మధ్యలో 750000 మంది పాలస్తీనా ముస్లిములు తమ ఇళ్ల నుండి గెంటి వేయబడి బయట దేశాల్లో శరణార్థులుగా మార్చబడ్డారు. గాజా పట్టీ అక్కడి ముస్లిములకు ఒక డిటెన్షన్ క్యాంప్ గా మార్చబడింది. దీనిని బట్టి ఏ విధమైన దౌర్జన్యం పాలస్తీనా ప్రజలపై జరిగిందో అంచనా వెయ్యవచ్చు. 1947 నుండి 49 మధ్యలో 15000 వేల మంది పాలస్తీనా ముస్లిములు దారుణంగా చంపబడ్డారు. వేల కొద్దీ ఇళ్లు నేలమట్టం చెయ్యబడ్డాయి. ఎంతో మంది కట్టుబట్టలతో భార్యా పిల్లల్ని తీసుకుని వేరే దేశాలకు కాలి నడకన వెళ్లిపోయారు.

ఐక్యరాజ్య సమితి ఇచ్చిన పరిమితులతో సంబంధం లేకుండా సుమారు 78 శాతం పాలస్తీనా భూభాగాన్ని ఇస్రాయీల్ ఆక్రమించింది.

ఇంతపెద్ద రక్తపాతాన్ని సృష్టించిన ఇస్రాయీల్ మే 15, 1948న ఇశ్రాయీల్ దేశాన్ని ప్రకటించారు. ఆ రోజును గుర్తు చేసుకుంటూ ప్రతీ సంవత్సరం పాలస్తీనియన్లు "అక్బా" దినంగా జరుపు కుంటారు. అక్బా అన్న అరబీ పదానికి "ఘోర విపత్తు" అని అర్థం.

## ఉమర్ ఖాలిద్ నిర్బంధంపై గళమెత్తిన అమెరికా మతస్వేచ్ఛ కమిటి


అమెరికాలో జరిగిన కాంగ్రెస్ విచారణలో అంతర్జాతీయ మతస్వేచ్ఛ కమిషనర్ ఎరిక్ యూల్యాండ్ ఉమర్ ఖాలిద్ నిర్బంధాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త ఉమర్ ఖాలిద్‌ను అక్రమంగా నిర్బంధంలో ఉంచారని అన్నారు. మతమైనారిటీల హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్తగా, వివక్షాభరితమైన చట్టానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసన తెలిపిన వ్యక్తిగా ఉమర్ ఖాలిద్‌ను పేర్కొన్నాడు. ఇండియాలో మతమైనారిటీ సముదాయాలకు చెందిన కార్యకర్తలను అణిచేయడానికి, భారత ప్రభుత్వం టెర్రరిస్టు వ్యతిరేక నల్లచట్టాన్ని విచక్షణారహితంగా ఉపయోగిస్తుందని వస్తున్న నివేదికలపై అమెరికా ప్రభుత్వం దృష్టిపెట్టాలని కోరాడు. మతస్వేచ్ఛను తీవ్రంగా అణిచేస్తున్న కారణంగా భారతదేశాన్ని కంట్రీ ఆఫ్ పర్టిక్యులర్ కన్సర్న్ అంటే ఆందోళన కలిగించే పరిస్థితి ఉన్న దేశంగా అమెరికా స్టేట్ డిపార్టుమెంటు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ అణిచివేతల విషయంలో పాలసీ నిర్ణయం తీసుకోవాలని, ఎలాంటి మినహాయింపులు లేకుండా ఇండియాను కంట్రీ ఆఫ్ పర్టిక్యులర్ కన్సర్న్‌గా ప్రకటించాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 13, 2020లో ఉమర్ ఖాలిద్‌ను ఉగ్రవాద ఆరోపణలతో అరెస్టు చేశారు. ఉపా చట్టం క్రింద ఆయన అరెస్టయ్యారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ఆయన చేసిన ప్రసంగం మతహింసను ప్రేరేపించేదిగా ఉందని ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టం ముస్లిములకు వ్యతిరేకంగా వివక్షాభరితంగా ఉందన్న విమర్శలు తీవ్రంగా వినిపించాయి. ముస్లిములకు తప్ప ఇతర శరణార్థులకు పౌరసత్వం ప్రసాదించే చట్టం ఇది. ఉమర్ ఖాలిద్ చేసిన ప్రసంగం బీజేపీ మతతత్వ ప్రభుత్వంపై అహింసాయుత ప్రతిఘటన చేయాలని చెప్పిన ప్రసంగమని ఎరిక్ అన్నారు. ఈ విచారణలో ఉమర్ ఖాలిద్ తండ్రి సయ్యద్ ఖాసీం రసూల్ ఇల్యాస్ కూడా పాల్గొన్నారు. ఆయన తన కుమారుడి కేసు మాత్రమే కాదు, దేశంలోని రాజకీయ ఖైదీలందరి కేసులకు ప్రాతినిథ్యం వహిస్తూ మాట్లాడారు. ఒక వివక్షాభరితమైన చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు దేశద్రోహం, ఉగ్రవాదం, ఉపా చట్టాల క్రింద కేసులు పెట్టడంలోని ఔచిత్యాన్ని ఆయన ప్రశ్నించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం గురించి ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 2024 ఎన్నికల తర్వాత ప్రస్తుత ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యానికి మరింత నష్టం కలుగుతుందన్న భయాందోళనలు వ్యక్తం చేశారు. ఇంటర్సెప్ట్ డిప్యూటీ ఎడిటర్, నాసికా రెన్నర్, భారత జర్నలిస్టు నిరంజన్ టాక్లేలు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వారిని ఉగ్రవాదులుగా, ఉగ్రవాద సానుభూతిపరులుగా ముద్రవేయడం ప్రమాదకరమని వివరించారు. ఉమర్ ఖాలిద్ పై ఆరోపణల్లో డొల్లతనాన్ని ఎత్తి చూపారు. అంతేకాదు, విశ్వహిందూ పరిషద్ కు చెందిన సాధ్వి రితుంబర ముస్లిం వ్యతిరేక హింసాకాండను రెచ్చగొట్టేలా ప్రసంగం చేసినా ఆమెపై చర్యలు లేకపోవడాన్ని వక్తలు ప్రస్తావించి, మతం ఆధారంగా చూపిస్తున్న వివక్షను ఎండగట్టారు. ఈ విచారణను అమెరికాకు చెందిన 18 పౌరహక్కుల సంఘాలు స్పాన్సర్ చేశాయి.

“హంతకుల మీద ఈ రోజు మనం నెపం నెట్టకూడదు. మన పట్ల వారి తీవ్ర ద్వేషాన్ని ఎందుకు గర్హించాలి? ఎనిమిది సంవత్సరాలుగా గాజాలోని శరణార్థి శిబిరాలలో వారు కూర్చున్నారు. వారు, వారి తండ్రులు నివశించిన చోట వారి భూములు, గ్రామాలను వారి కళ్ళ ముందే మన ఎస్టేట్లుగా మార్చివేయటాన్ని వారు చూస్తున్నారు” ఈ మాటలు చెప్పింది జనరల్ మోషే డయాన్. నూటికి నూరు పాళ్లు యూదు దురహంకారే. 1948లో ఇజ్రాయిల్ మిలిటరీ పాలస్తీనా అరబ్బు ప్రాంతాల మీద జరిపిన దురాక్రమణ, హత్యాకాండకు నాయకత్వం వహించిన అధికారులలో ఒకడు. తరువాత మిలిటరీ ప్రధాన అధికారిగా పని చేశాడు. 1956లో పాలస్తీనా గెరిల్లాలు జరిపిన దాడుల తరువాత డయాన్ చేసిన వ్యాఖ్యలివి. తరువాత కాలంలో పాలస్తీనియన్లతో శాంతి పరిష్కారం కోరుకున్న కారణంగా అదే యూదు దురహంకారులు అతన్ని పక్కన పెట్టారు.

పాలస్తీనా-ఇజ్రాయిల్ వివాదంలో ఒక యూదు దురంహంకారికి తెలిసిన మేరకు కూడా మధ్యవర్తిగా ఉన్న అమెరికాకు అర్థం కానంత అమాయకంగా ఉందా? 1948 నుంచి పాలస్తీనియన్ల ప్రాంతాలను ఆక్రమించి వారిని తరమివేయటంతో విదేశాల్లో శరణార్థులుగా, బహిరంగ జైలుగా మార్చిన పాలస్తీనా ప్రాంతాలలో బందీల మాదిరి క్షణం క్షణం ఏం జరుగుతుందో తెలియని భయం, అనిశ్చితిలో బతుకుతున్నారు.

ఈ బూడిద గుట్టల మీద నీ అధికారం ఎన్నాళ్ళు సాగుతుంది తిరిగి మరలిపోయిన మనుషులు తప్పక తలెత్తుకుని వస్తారు పచ్చని చిగుళ్ళని మొలకెత్తించడానికి... ఆసుపత్రులు తెరచుకుని మరల పురుళ్ళు పోసుకుంటాయి బడి గంటలు మోగి చినిగిన పైజామాలు ఎగదోసుకుంటు పిల్లలు మరల పలకా బలపం పట్టి తమ భవిష్యత్ చిత్రపటాన్ని లిఖించుకుంటారు ఫీనిక్స్ పక్షిలా మరలా గాజా లేచి నిలబడుతుంది నువ్వెన్ని సార్లు బూడిద చేసినా ఎందుకంటే వాళ్ళు మనుషులు కదా?

# ఫాసిజంపై అక్షర గర్జన







**ప్రముఖ** ఇస్లాంవాద రచయిత్రి శ్రీమతి షేక్ ఖుర్షీద్ బేగం రాసిన అబాబీలు కవితా సంపుటి “మేఘ గర్జన” పుస్తకాన్ని నవంబర్ 5, 2023 ఆదివారం నాడు గుంటూరులోని జమాత్ ఇస్లామి హింద్ కాన్ఫరెన్స్ హాల్‌లో ముస్లిం రచయితల ఆధ్వర్యంలో ప్రముఖ కవి భూసురపల్లి వెంకటేశ్వర్లు గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముస్లిం రచయితల వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు ప్రఖ్యాత ఇస్లాంవాద కవి శ్రీ కరిముల్లా అధ్యక్షత వహించారు. మనువాదం మీద, మతతత్వం మీద, ఫాసిస్టు శక్తుల మీద ఖుర్షీద్ బేగం గారు రాసిన మేఘ గర్జన ధీటైన సమాధానం అని చెప్పారు. సమాజంలోని అన్ని రుగ్మతలను రచయిత్రి తన కలం ద్వారా ప్రక్షాళన చేసే ప్రయత్నం చేశారు అని చెప్పారు. ఇలాంటి సామాజిక స్పృహ కలిగిన రచనలు నేటి సమాజంలో అవసరం అని చెప్పారు. రచయిత్రి ఖుర్షీద్ బేగం మాట్లాడుతూ, ఇస్లాం మీద అనుమానాలు, అపోహలు దూరం చేస్తూ సమాజంలో జరిగే ప్రతి అనైతికతను, అన్యాయం, మతతత్వాలను ప్రశ్నించడమే రచయిత్రిగా తన బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి భూసురపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ రచయిత్రి నల్లూరి రుక్మిణి, ప్రముఖ కవి కరిముల్లా, మురసం అధ్యక్షులు హకీమ్, రషీద్, బషీర్, సుభాని, జాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లాహ్ ఆగ్రహానికి భయపడాలి

- నసీరా బేగం

**అల్లాహ్** ఆగ్రహాన్ని రగిలించే, ఆయన ఆపదను, శిక్షను ఆహ్వానించే, అత్యంత ఘోరమైన పాపాలేమిటంటే, బలంగా ఉన్న మానవుడు, అధికారంలో ఉన్న రాజ్యాధికారులు బలహీనమైన ప్రజలపై దౌర్జన్యం చెయ్యటం, అన్యాయంగా రక్తపాతాన్ని ప్రవహింప జెయ్యటం, వారి గృహాలను, వారి ఊళ్ళను నామరూపాలు లేకుండా చెయ్యటం, వారిని ఆకలి దప్పులకు గురిచెయ్యటం, వారి పసి పిల్లలను హతమార్చటం, వారి ముసలి వారిని చంపటం ఇదంతా ప్రతీకారం తీసుకోవటానికి చెయ్యబడు తుంది. ఈ ప్రతీకార జ్వాలతో ఆహుతి అయిపోయేది నిస్సహా యులు, బలహీనులు అయిన ప్రజలే. నిస్సహాయులపై దౌర్జన్యానికి పాల్పడటాన్ని అల్లాహ్ ఎంతమాత్రం సహించడు. అది ఒక వ్యక్తి అయినా, ఒక సమూహం అయినా, ఒక దేశం అయినా సరే.

అల్లాహ్ అత్యంత కారుణ్యం గలవాడు, సర్వాధికారాలు, సర్వశక్తులు తన అధీనంలో ఉన్నప్పటికీ క్షమించటం అనేది ఆయన ప్రత్యేక గుణం. ఆయనలో ఈ గుణం లేకపోయినట్ల యితే మానవ మాత్రుడు ఎవ్వడు ఒక్క క్షణం కూడా ఈ భూమిపై జీవితం గడిపి ఉండేవాడు కాడు. కనుకనే మనిషి ఘోరమైన పాపాలు చేస్తూ ఉన్నా అతనికి గడువు అనే పెద్ద అవకాశాన్ని ఆయన ఇస్తూ పోతాడు. దౌర్జన్యపరుడు సాధారణంగా ఆ గడువును ప్రత్యేక కారుణ్య అవకాశంగా భావించి తన దౌర్జన్యాన్ని మరింతగా అధికం చేసినట్లయితే, విర్రవీగినట్లయితే ఆ త్రాడును వేగంగా తన వైపు ఆయన లాక్కుంటాడు. అప్పుడు అతను నేలపై పడి తన ముఖాన్ని పగలగొట్టుకోవటం తప్ప మరే అవకాశమూ ఉండదు. ఎందుకంటే అల్లాహ్ ప్రజల అసంఖ్యాకమైన తప్పులను క్షమిస్తాడు గానీ తన దాసులపై చేసే దౌర్జన్యాన్ని ఎక్కువ కాలం వరకు సహించడు. అన్యాయానికి గురైన ప్రజలు, అల్లాహ్ మధ్య ఎలాంటి అడ్డు పరదా ఉండదు. వారి ఆర్తనాదాలు అల్లాహ్ వెంటనే ఆలకిస్తాడు. ఆ దౌర్జన్యపరులను శిక్షించటానికి సిద్ధపడతాడు. వారికి ఇహలోకంలోను శిక్షకు గురిచేస్తాడు. ఇతరులకు గుణపాఠం కావాలని పరలోకంలో అయితే అగ్నికి ఆహుతి చేస్తాడు. కనుకనే ఎవరైనా సరే తన ద్వారా ఇతరులపై ఎలాంటి దౌర్జన్యం జరగకుండా జాగ్రత్త పడాలి. దివ్య ఖుర్ఆన్‌లో ఈ విషయాన్ని గురించి ఆయన తెలపటానికి చరిత్రలో జరిగిన ఎన్నో సంఘటనలను ప్రస్తావించాడు. అందులో దుర్మార్గుడైన ఫిరౌన్ రాజు సంఘటన కూడా ఒకటి. అది ఇలా ఉంది :

మేము వారికి పూర్వం ఫిరౌన్ జాతి వారిని ఇటువంటి పరీక్షకే గురిచేశాము. వారి వద్దకు ఎంతో మర్యాదస్తుడైన ఒక ప్రవక్త వచ్చాడు. అతను ఇలా అన్నాడు : అల్లాహ్ సేవకులను నాకు అప్పగించండి. నేను మీకొరకు వచ్చిన ఒక నమ్మకస్తుడైన ప్రవక్తను అల్లాహ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చెయ్యకండి. నేను మీ ముందు స్పష్టమైన ప్రమాణాన్ని ఉంచుతున్నారు. మీరు నా మీద దాడి చేయకుండా నేను మన ప్రభువు శరణు పొందాను. ఒకవేళ మీరు నా మాట నమ్మకపోతే సరే, నా జోలికి మటుకు రాకండి. చివరకు అతను, ఈ ప్రజలు అపరాధులు అని తన ప్రభువుతో చెప్పుకున్నాడు. ఇలా జవాబు ఇవ్వబడింది. మంచిది రాత్రికి రాత్రే నా సేవకులను తీసుకుని బయలుదేరు. మిమ్మల్ని వెంటాడటం జరుగుతుంది. సముద్రాన్ని అది ఉన్న స్థితిలోనే విడిచిపెట్టు. అప్పుడు ఈ సైన్యం అంతా మునిగిపోతుంది.

వారు ఎన్ని తోటలను, ఎన్ని నీటి బుగ్గలను, ఎన్ని పొలాలను, ఎన్ని అందమైన సౌధాలను వదలివెళ్ళారు. వారు అనుభవిస్తూ

ఉన్న విలాస వస్తువులు ఎన్నో వారి వెనుకనే ఉండిపోయాయి. ఇలా జరిగింది వారి ముగింపు.

మేము ఇతరులను ఈ వస్తువులకు వారసులుగా చేశాము. తరువాత వారి కొరకు ఆకాశమూ విలపించలేదు, భూమీ విలపించలేదు. వారికి కొద్దిపాటి వ్యవధి కూడా ఇవ్వబడలేదు.

ఈ విధంగా మేము ఇస్రాయీల్ సంతతి వారికి అవమానకరమైన శిక్ష నుండి, ఫిరౌన్ నుండి విమోచనం కలిగించాము. అతడు హద్దులు మీరిన వారితో నిజంగానే అగ్రశ్రేణికి చెందినవాడు. (44: 17-33)

ఈ వాక్యాలలో కరడుగట్టిన, అత్యంత నీచాతినీచుడైన దుర్మార్గుడు ఫిరౌన్ దౌర్జన్యం అతను తన శక్తి బలాన్ని,సంఖ్యా బలాన్ని చూసుకుని బలహీనంగా ఉన్న జాతి మీద దౌర్జన్యాలు చెయ్యసాగాడు. అతని క్రూరత్వం ఎంతగా అతని హృదయాం తరాల్లో నాటుకుపోయిందంట అతడు ఆ బలహీన జాతి మగ పిల్లలను పుట్టగానే నరికి చంపివేసేవాడు. ఆడపిల్లలను వదిలిపెట్టి బానిసలుగా చేసుకునేవాడు. వారికి ఎలాంటి అధికారాలు ఉండేవి కావు.

ఆ జాతి అత్యంత దయనీయమైన నిస్సహాయ స్థితిలో జీవితం గడుపుతూ ఉండగా వారి హృదయాక్రందనను అల్లాహ్ ఆలకిం చాడు. వారి వద్దకు ప్రవక్త మూసా(అ)ను పంపాడు. కాని రాజు ఆయన్ని ధిక్కరించాడు. తిరుగుబాటు చెయ్యసాగాడు. నిస్సహాయ జాతి సహాయం కోసం, వారి విముక్తి కోసం దైవప్రవక్త మూసా(అ) అతడిని ఎదుర్కొన్నారు. జాతి ప్రజలను తీసుకుని దేశం విడిచి వెళ్ళసాగారు. అప్పుడు క్రూరమైన ఫిరౌన్ వారిని వెంబడించాడు. చివరకు సముద్రంలో అల్లాహ్ ఆజ్ఞ ద్వారా ఏర్పడిన ద్వారం గుండా మూసా జాతి ప్రజలు సముద్రం దాటుతూ ఉన్నప్పుడు, దౌర్జన్యపరుడైన ఫిరౌన్ వివేకం సముద్రంలో కొట్టుకుపోయింది. దుర్మార్గపు మదంతో తూలుతూ సముద్రపు మార్గంపై ముందుకు సాగాడు. అతని వెంట అతని లక్షలాది సైన్యం కూడా అతనిని అనుసరించింది. సముద్రం మధ్యలోకి అందరూ వచ్చేసినప్పుడు సముద్రాన్ని కలిసిపో అంటే మార్గాన్ని తుడిచిపెట్టు అనే దైవాజ్ఞ అయింది. అంతే అది కలిసిపోయింది. ఆ దుర్మార్గపు రాజుతో పాటు ఆ సైన్యమంతా ఆ సముద్రం గర్భంలో కలిసిపోయింది. నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయి ఇలా జరిగింది. ఆ గర్విష్టి రాజు గారి రాజ్యం ముగింపు.

దౌర్జన్యపరులు తమ పన్నాగాలపై, తమ ఎత్తుగడలపై సంతోషిస్తూ ముందుకు సాగుతూ ఉంటారు. తమకు సాటి ఎవ్వరూ లేరని భావిస్తారు. తమను ఎవ్వరూ ఎదుర్కోలేరనే భ్రమకు గురి అవుతూ ఉంటారు. కాని అల్లాహ్ తన పన్నాగాన్ని తాను పన్నుతూ ఉంటాడు. ఆయన గనక ఒకవేళ ప్రతీకారానికి దిగినట్లయితే పెద్దపెద్ద శక్తులేవీ పనికిరావటం అనేది జరగదు. సర్వనాశనమూ తప్పదు.

కనుకనే ఆయన అన్యాయానికి పాల్పడకండి అని ఖుర్ఆన్ గ్రంథంలో వందలసార్లు ప్రస్తావించాడు. ఒక హదీసులో అల్లాహ్ ఇలా ప్రస్తావించాడు : నా గౌరవం సాక్షిగా! నా ఆగ్రహం సాక్షిగా! నిస్సందేహంగా నేను దౌర్జన్యపరునితో ప్రతీకారం తీసుకుంటాను. ఈ ప్రపంచంలోను, పరలోకంలో కూడాను. ఇంకా అతనితో కూడా ప్రతీకారం తీసుకుంటాను, ఎవడైతే అన్యాయానికి గురైన వారిని నిస్సహాయ స్థితిలో చూసినప్పుడు దానిని ఆపే శక్తి సామర్థ్యాలు కలిగి ఉండి కూడా ఆపని వాడితో కూడా. (ముస్నద్ అహ్మద్)

దౌర్జన్యపు సమయం అతి తక్కువగా ఉంటుంది. అది ఎంతగా కరాళ నృత్యం చేసినప్పటికీను. ఎంత మందిని పొట్టన పెట్టు కున్నటికీను, ఎంతటి విధ్వంసాన్ని సృష్టించినప్పటికీను. ఏవిధంగా నైతే ఆకాశం నుండి భీకరంగా కురిసే వర్షం కొద్దిసేపటి వరకు కురిసినప్పటికీ ఆ నీటి ద్వారా జన జీవితం ప్రభావితమైనప్పటికీ, విధ్వంసానికి గురిచేసినప్పటికీ దాని సమయం కొద్దిసేపు మాత్రమే ఉంటుంది. ఆ తరువాత పచ్చటి పొలాలు ఆనందంతో నాట్య మాడుతూ ఉంటాయి. ఎటుచూసినా పచ్చదనంతో నిండిపోయి ఉంటుంది. ఎందుకంటే అదేవిధంగా నిస్సహాయతకు గురి అయిన ప్రజలు కొంత సమయం వరకు ప్రభావితమైనప్పటికీ తిరిగి వారికి అంతకంటే మంచిరోజులు లభిస్తాయి. ఎందుకంటే నిస్సహాయుల వెంట వారి ప్రభువు ఉంటాడు.

అంతేకాదు, ప్రళయదినం నాడు విశ్వాసులకు కాంతిని పంచి పెట్టడం జరుగుతుంది. అప్పుడు వారు ఆ వెలుగులో ప్రయాణి స్తున్నప్పుడు వారి వెలుగు వారికంటే ముందు వారికి దారి చూపుతూ పయనిస్తూ ఉంటుంది. వారు హాయిగా సంతోషంగా ముందుకు సాగుతూ ఉంటారు.దౌర్జన్యపు ప్రజల చుట్టూ వారి అన్యాయాలు, దౌర్జన్యాల అంధకారం కమ్ముకుని ఉంటుంది. ఆ చీకటిలో వారు ముందుకు కదలలేక, వెనుకకు వెళ్ళలేక నిస్సహాయతకు గురై సహాయం కోసం విశ్వాసులను పిలుస్తారు. కాని వారి పిలుపును వారు అంగీకరించరు. ఇంకా ఎలాంటి సహాయమూ చెయ్యరు. వారు ఆ అంధకారంలో కొట్టుమిట్టా డుతూ ఉంటారు.

# కన్న పేగు

- ముహమ్మద్ హనీఫ్,
మార్కాపురం



ప్రపంచంలో ఎన్నో మతాలు, ఎన్నో కులాలు, ఆచారాలు, సంస్కృతీ సంప్రదాయాలు ఉన్నాయి. ఎన్ని వున్నా అందరి ప్రేమ కన్నవారి ప్రేమ ఒక్కటే. తల్లిదండ్రులు తమ కూతుర్ని ఒక అయ్య చేతిలో పెట్టి, ఘనంగా పెళ్ళి చేసి పంపుతారు. అక్కడ నుంచి ఎంతో ఆనందంగా సంసారం సాగుతుంది. ఆమె గర్భవతి అయింది అని తెలిసిన తరువాత ఆ భార్యాభర్తలు ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు. కడుపులో పెరిగే బిడ్డను చూసు కుంటూ మురిసిపోతుంది. ఎందుకంటే నేను ఓ తల్లిని కాబోతు న్నాను అని ఆమె మనసులో ఎన్నో కోరికలు. బిడ్డ గురించి ఎన్నో కలలు కంటుంది. నవమాసాలు మోసి కని ప్రసవ వేదనతో బిడ్డను జన్మనిస్తుంది. తన బిడ్డను చూసుకుంటుంది. అప్పటినుంచి ఎంతో అల్లారుముద్దుగా పెంచుతుంది. గుండెలకు హత్తుకొని పాలు ఇస్తుంది. కొంత ఎదిగిన తరువాత గోరుముద్దలు తినిపి స్తుంది. అతని మీద ఆ తల్లి ఎన్నో ఆశలు పెట్టుకుంటుంది. బాలుడు బడికి పోయే వయసు వస్తే తల్లి స్కూల్ బ్యాగ్ మోసుకుని పోయి స్కూల్‌లో వదిలిపెట్టి వస్తుంది. యుక్త వయసు వచ్చిన తరువాత అన్ని తెలిసిన తరువాత ప్రయోజకుడు అయిన తరువాత తల్లి అతని మీద పెట్టుకున్న ఆశలు ఒక్కసారిగా కూలిపోతుంటే ఏమి చెయ్యలేని పరిస్థితి చెయ్యిదాటి పోతూ ఉంటుంది. ఒకడు భార్య మాట విని తల్లిని వదలి ఎక్కడికో దూరం వెళ్ళిపోతాడు. ఎన్నో కష్టాలు పడి మేము తినకపోయినా ఒక్క పూట పస్తులు ఉండి నిన్ను మంచి పొజిషన్‌లో పెట్టినాము నీకు రెక్కలు రాక ముందు మేము నీకు ఎలాగా చూసుకున్నాము. ఈనాడు నీకు రెక్కలు వచ్చినవి అని మమ్మల్ని వదిలి వెళ్ళి పోతున్నావా, నిన్ను మేము పోషించటానికి కూలి పని చేసినాము. ఇండ్లలో పాచి పని చేసినా ఈనాడు కన్న పేగును తల్లిని మోసం చేస్తున్నారు. తల్లికి మనశ్శాంతి లేకుండా చేసే సుపుత్రులు వున్నారు. అమ్మను బయటికి గెంటివేస్తున్నారు.

ఆస్తులు పంచుకున్న తరువాత తల్లిదండ్రులకు మనశ్శాంతి గా బ్రతకనివ్వడంలేదు. ఆ తల్లికి ఒక ముద్ద అన్నం పెట్టడానికి కూడా ఎంతో ఆలోచన చేసేవారు ఉన్నారు. ఎంతోమంది వృద్ధాప్యంలో కన్నవారు వారికి బయటికి పంపితే చేరదీసే వారు లేక వారి మనసు ఎంత మధనపడుతుంది. ఆ తల్లి చావలేక బ్రతకలేక ఈ జీవితం ఇంత ఇంతమంది వున్నా దిక్కులేని అనాథగా మిగిలిపోవలసిందే అని గుండె బాదుకుంటుంది. బాధపడుతుంది.

మాతృమూర్తి విలువ తెలుసుకోలేక నలుగురిలో చులకన చేసి మాట్లాడే పుత్రులు ఉన్నారు. కొడుకు ఎన్ని తప్పులు చేసినా తిట్టినా కొట్టినా, దూషించినా, తిండిపెట్టకపోయినా వారు ఆస్తులు పంచుకున్నా తల్లి మనసులో స్వార్థం ఉండదు. అన్ని పోగొట్టు కున్నా తల్లి పాదాలు పట్టుకుని క్షమించు అని చెప్పినవెంటనే తల్లి మనసు కరిగిపోయి అన్నీ మరిచిపోతుంది. అది కన్న పేగు.

సహనం వహించేదే మాతృమూర్తి. కొంతమంది కొడుకులు మత్తుకు బానిసలు అయి డబ్బులు ఇవ్వలేదు అని అతి దారుణంగా చంపినవారు ఉన్నారు. ఇటీవల పత్రికలో మద్యం మత్తులో కన్నవారినే ఇనుప కడ్డీతో కొడితే నెత్తుటి మడుగులో విలవిలల్లాడి చనిపోయింది.

“తల్లి విలువ తెలుసుకున్నవారు వారి జీవితాలు అనందమవుతాయి”

తల్లి మాటను జవదాటని పుత్రులు ఉన్నారు. తల్లి సేవను ఒక పరమార్థంగా భావించేవారు ఉన్నారు. తల్లికి ఎలాంటి కష్టంగాని, దుఃఖంగాని, బాధగాని రానివ్వకుండా చూసుకునే పుత్రులు ఉన్నారు. తల్లి ఒకమాట చెప్పిన వెంటనే తూ.చ తప్పకుండా చేసేవారు ఉన్నారు.

ఆ తల్లికి ఎలాగా సేవ చేసినది, తల్లిదండ్రులు మంచిగా చదివించారు. ఆ తరువాత అతనికి సౌదీలో ఉద్యోగం వచ్చింది. జీతం ఎక్కువగా ఉంటుంది. ఒక రోజు తల్లికి క్యాన్సర్‌తో బాధ పడుతుంది. ఆ విషయం తెలుసుకున్న పుత్రుడు వెంటనే సౌదీలో ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి తల్లికి సేవ చెయ్యాలి అని తన భార్యతో వచ్చేశాడు. ఉన్న ఊర్లో ఏదో చిన్న అంగడి పెట్టుకుని జీవితం సాగిస్తూ తల్లికి వేళకు మందులు ఇస్తూ తల్లి సేవలో మునిగిపోయాడు.

వేరే తల్లి ముగ్గురు అక్కలు ఒక్క మగపిల్లవాడు. అక్కలు పెద్దవారు. వారి పెళ్ళిళ్ళు తండ్రి వున్నప్పుడే జరిగిపోయినవి. కొంత కాలానికి తల్లి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి పోయింది. ఆ తల్లి కోమాలోకి వెళ్ళిపోయింది. మంచం మీద పడుకొని ఉంటుంది. అటుఇటు చూస్తుంది. మాట కూడా పడిపోయింది. ఆ తల్లి ఏమి మాట్లాడలేని స్థితి. తల్లిని చూసేవారు ఒకే ఒక్క బిడ్డ ఉన్నాడు. వారి అక్కలు వచ్చి నీవు పెళ్ళి చేసుకో అంటే నేను పెళ్ళి చేసుకోలేను ఎందుకు అంటే వచ్చే ఆమె నా కన్న తల్లిని చూస్తుందో లేదో అందుకు అని నేను పెళ్ళి చేసుకోలేను. అమ్మను చూసేవారు ఎవరు లేరు కదా, మీరు అత్తారింటికి వెళ్ళిపోతారు. మీ సంసారం మీ కష్టసుఖాలు మీకు ఉన్నాయి అన్నాడు. నీవు ఒక్కడివే కదా అయినా పర్వాలేదు. ఆ దైవం నాకు ఎల్లప్పుడూ తోడు ఉంటాడు. నేను మా అమ్మను జాగ్రత్తగా చూసుకుంటాను. అప్పటి నుంచి తల్లి సేవలో మునిగిపోయాడు. కన్నవారి కలలను నిజం చేసిన ఏకైక పుత్రుడు అది ఎలాంటి సేవ అంటే చిన్నతనంలో నాకు ఎలాంటి సేవ చేసిందో. ఇప్పుడు ఆ బిడ్డ ఆ తల్లికి అదేవిధంగా సేవ చేస్తువున్నాడు. ఆ తల్లి మనసులోనుంచి కన్నీటి రూపంలో తల్లి అదే పనిగా అతని వైపు చూస్తుంది. తన కుమారుడు ఆ తల్లి సేవ చెయ్యటం మరపురాని మరిచిపోనిది. తల్లి పనులు చేసిన తరువాత అతను స్కూల్‌లో పనిచేసేవాడు. టైమ్‌కు వచ్చి తల్లికి తినిపించి పోయేవాడు. మళ్ళీ రాత్రి పాలు తాపించేవాడు.

ఇరుగు పొరుగు వారితో ఎంతో ప్రేమానురాగాలతో వుండేవాడు. అందరికి ఎంతో ప్రేమతో పలకరించేవాడు. అలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 18 సంవత్సరాలు తల్లి సేవలోనే ఉన్నాడు. ప్రతి రోజు తల్లి బట్టలు మార్చేవాడు. మంచం మీద మెల్లగా దుప్పట్లు పరిచేవాడు. ఆ రాత్రి తల్లి దగ్గరకు వచ్చి అమ్మ ఈ రోజు నా గుండెలో నొప్పిగా ఉన్నది. నాకు ఎలాగో ఉంది. ఆ తల్లి తన కుమారుడు చెప్పిన మాటలు వింటుంది. కాని ఏమి చెయ్యలేని పరిస్థితి. ఎవరికి పిలవలేదు. ఇంట్లో తల్లి కొడుకు తప్ప ఎవరులేరు. ఆ రాత్రి చివరి రాత్రి అని అతనికి కూడా తెలియదు. తల్లి కళ్ళలోనుంచి నీరు వస్తుంది. ఏడుస్తుంది. నొప్పి అని చెప్పి సోఫా మీద వాటిపోయాడు. తల్లిని చూస్తూ తల్లి ముందు అతని ప్రాణం పోయింది.

తలుపు గడియ పెట్టివున్నారు. రెండు రోజులు అవుతుంది. స్కూల్‌లో పనిచేసే వ్యక్తి రెండు రోజులు అవుతుంది. ఫోన్ చేస్తే ఎత్తడంలేదు అని అనుమానంతో స్కూల్ వారు ఇంటికి వచ్చారు. చూస్తే తలుపులు గడియ పెట్టి ఉన్నది. చుట్టుపక్కల వారికి పిలిచారు. అందరూ కలిసి తలుపులు పగలగొట్టి చూస్తే ఏముంది... విగతజీవిగా పడివున్నాడు. తల్లి మూగవోయింది. అందరూ చూసి డాక్టర్ గారిని పిలిచారు. డాక్టర్ నాడి చూసి రెండు రోజులు అయినది చనిపోయి అన్నాడు. ప్రాణం ఎప్పుడో పోయింది. తల్లి మనసులోనుంచి కన్నీరు ఆగలేకపోతుంది. తరువాత అందరికి ఫోన్ చేశారు. ఆ తరువాత కొద్దిరోజులకే తల్లి కూడా చనిపోవటం జరిగింది.

ఒక వ్యక్తి దైవప్రవక్త(స) దగ్గరికి వచ్చి దైవప్రవక్తా నా మంచి ప్రవర్తనకు అందరికన్నా ఎక్కువగా హక్కుదారులెవరు? అని అడిగాడు. దానికి ఆయన(స) ‘నీ తల్లి’ అని చెప్పారు. ఆ తరువాత ఎవరు? అని అడగ్గా ఆయన(స) ‘నీ తల్లి’ అనే చెప్పారు. ఆ వ్యక్తి మళ్ళీ తరువాత ఎవరు? అని అడగ్గా అప్పుడు కూడా ‘నీ తల్లి’ అనే చెప్పారు. దైవప్రవక్త(స) ఆ వ్యక్తి మళ్ళీ అడిగాడు ఆ తరువాత ఎవరు? అని. అప్పుడు ‘నీ తండ్రి’ అని చెప్పారు. (బుఖారీ- ముస్లిమ్)




## అలీఘఢ్ విశ్వవిద్యాలయం సాధించిన మరో విజయం

అలీఘఢ్ ముస్లిం యూనివర్శిటీ విద్యార్థుల అసాధారణ ప్రతిభా సామర్థ్యాలు మరో మైలురాయిని దాటాయి. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ అలీఘఢ్ విశ్వవిద్యాలయానికి అంతరిక్ష సాంకేతిక రంగంలో ప్రవేశించే అనుమతి ఇచ్చింది. ఇది కేవలం AMU సాధించిన విజయం మాత్రమే కాదు, భారతదేశంలోని మైనారిటీ సముదాయం సాధించిన ముఖ్యమైన విజయంగా భావించాలి. మైనారిటీ యువతలో ప్రతిభా సామర్థ్యాలకు నిదర్శనం ఈ పరిణామం. యూనివర్సిటీ వ్యవస్థాపకుడు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ గౌరవార్థం ఈ ఉపగ్రహానికి 'SS AMU SAT' అని నామకరణం చేశారు. ఈ పరిణామం దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. నవంబర్ 2021లో AMU రోబో క్లబ్‌లో ఈ ప్రాజెక్టు ప్రారంభమయ్యింది. భారతదేశంలోని అత్యంత పేద జిల్లాలలో ఆర్థిక వృద్ధి విధానాలను అధ్యయనం చేయాలనే ప్రతిష్టాత్మక లక్ష్యంతో 3U క్యూబ్‌శాట్‌తో రూపొందించబడింది. స్వతంత్రంగా అభివృద్ధి చేసిన ఇమేజ్ కంప్రెషన్ టెక్నాలజీ, మల్టీమీడియా ట్రాన్స్‌మిషన్ స్పీడ్‌లవిషయంలోను ఈ ఉపగ్రహం నమూనాగా మారుతుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చైర్‌పర్సన్, ప్రాజెక్ట్ హెడ్ ప్రొ. అక్రమ్ ఖాన్ ప్రకారం అలీఘఢ్ విశ్వవిద్యాలయం నూతన ఆవిష్కరణలు, సామాజిక పురోగతి పట్ల ఎలాంటి నిబద్ధత కలిగ ఉందో ఈ క్యూబ్‌శాట్ ఉపగ్రహం చాటి చెబుతోంది. SS AMU SAT కోసం ప్రతిపాదన జనవరి 2023లో సమర్పించడం జరిగింది. కఠినమైన పరిశీలన తర్వాత, AMU, IN-SPAce మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం ఇది సెప్టెంబర్ 2023లో ఆమోదించ బడింది. ప్రముఖ AMU పూర్వ విద్యార్థులు, ప్రపంచవ్యాప్తంగా నిపుణుల నుండి సాంకేతిక నైపుణ్యాన్ని స్వీకరించడం తదితర కార్యకలాపాలు వచ్చే ఆరు నెలల్లో ప్రారంభం కాబోతున్నాయి. అన్నా యూనివర్శిటీ అడుగుజాడల్లో అలీఘఢ్ నడుస్తుందని చెప్పాలి. 2009లో భారతదేశంలో మొట్టమొదటిసారి విద్యార్థులు నిర్మించిన ANUSATని ప్రయోగించడం అన్నా యూనివర్శిటీ ఒక ఉదాహరణగా నిలిచింది. ఇది అంతరిక్ష కార్యకలాపాలు ఎక్కువైన నేపథ్యంలో అది కూడా రష్యన్ ఉపగ్రహాలు చేసే విన్యాసాలపై అంతర్జాతీయంగా ఆందోళనలు కనిపిస్తున్న కాలంలో ఈ కొత్త ప్రాజెక్టును విద్యార్థులు చేపట్టారు. AMU ఉపగ్రహ ప్రాజెక్ట్ విజయం అంకితభావంతో కూడిన విద్యా సంస్థలు సాధించే విజయాలకు మరో కొత్త ఉదాహరణగా నిలుస్తుంది.

## అనంతపురంలో ముస్లిం ఐక్యసంయుక్త కార్యాచారణ సమితి ఆరోపణలు

అనంతపురం నగర ప్రధాన రహదారి విస్తరణలో రాజకీయ మతలబు దాగి ఉందని ముస్లిం ఐక్య సంయుక్త కార్యాచరణ సమితి ఆరోపిస్తోంది. కమిటీ కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేసింది. కల్యాణదుర్గం బైపాస్ నుంచి రాప్తాడు పంగల్ రోడ్డు దాకా 310 కోట్ల రూపాయల జాతీయ రహదారి నిర్మాణం సాగుతోందని, క్లాక్ టవర్ నుంచి సుభాష్ రోడ్ దాకా రాజకీయ పలుకుబడి సిఫార్సులు ఉన్నవారికి ఒక రకంగా, ఎలాంటి పలుకుబడి లేని వారికి మరో రకంగా అలైన్‌మెంట్ వేశారని విమర్శించారు. సప్తగిరి సర్కిల్ వద్ద మస్జిదువైపు ఏడు మీటర్లు, దీనికి ఎదురుగా ఉన్న దుకాణాల వైపు కేవలం రెండు మీటర్లు మాత్రమే అలైన్‌మెంట్ వేసారని విమర్శించారు. ముందుగా నిర్దేశించిన ప్రకారమే విస్తరణ సాగాలని, ఒకవేళ మస్జిదు వైపు దుకాణాలు తొలగించాల్సి వస్తే తప్పనిసరిగా మస్జిద్ కమిటీతోను, ఐకాసా నాయకులతోను చర్చించాలని డిమాండ్ చేశారు.

## 12. తెలంగాణ ముస్లిముల డైలమా

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ముస్లిం గ్రూపులు చీలిపోయినట్లు కనిపిస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను సమీపిస్తున్న తరుణంలో, ముస్లిం సమాజం భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీ మధ్య ఎవరి వైపు మొగ్గాలో తెలియని అయోమయానికి గురవుతోంది. బీఆర్ఎస్ ఎన్నికల హామీలను నెరవేర్చలేదనే విమర్శ ఉంది. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ వంటి విషయాల్లో బిఆరెస్ విఫలమైందని విమర్శిస్తున్నారు. వైస్ చాన్సలరుగా ఒక్క ముస్లిం కూడా లేకపోవడం, సర్వీస్ కమీషన్‌లో ముస్లిములకు ప్రాతినిథ్యం లేకపోవడం వంటి అనేక అసంతృప్తులున్నాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో పోల్చుతూ బీఆరెస్ కూడా అలాంటిదేనని, ప్రత్యామ్నయం కాంగ్రెస్ అంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ వాదిస్తోంది. మరోవైపు యునైటెడ్ ముస్లిం ఫోరమ్ మైనారిటీ సంక్షేమానికి ప్రభుత్వ అంకితభావాన్ని ప్రశంసిస్తూ బీఆర్ఎస్‌కు తన మద్దతునిచ్చింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మైనారిటీ సంక్షేమానికి అత్యధిక బడ్జెట్‌ను కేటాయించి, మైనారిటీల సామాజిక, ఆర్థిక స్థితిగతులకు గణనీయంగా ప్రయోజనం చేకూర్చే పథకాలను ప్రారంభించినందుకు బిఆర్ఎస్‌ను యునైటెడ్ ముస్లిం ఫోరమ్ ప్రశంసించింది. రెసిడెన్షియల్ పాఠశాలల స్థాపన, 'షాదీ ముబారక్' పథకం మైలురాళ్లుగా యునైటెడ్ ముస్లిం ఫోరమ్ పేర్కొంది. తమ ప్రయోజనాలు ఎవరు కాపాడతారన్న చర్చ ముస్లిం సముదాయంలో పెద్దస్థాయిలో జరుగుతోంది. ఇది రాజకీయ చైతన్యానికి నిదర్శనం. ముస్లిం ఓట్ల మొగ్గు ఎటువైపు ఉంటుందో దాన్ని బట్టి ఎన్నికల ఫలితాలు కూడా ఉంటాయని చాలా మంది భావిస్తున్నారు.

సర్వత్రా

## తాలిబాన్‌తో జతకడుతున్న చైనా

ఇటీవలి కాలంలో, తాలిబాన్‌తో చైనా సాన్నిహిత్యం పెరిగింది. ఇది పరస్పర ప్రయోజనాల లక్ష్యంతో చోటు చేసుకున్న వ్యూహాత్మక భాగస్వామ్యంగా చెప్పాలి. చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ 10వ సంవత్సరాన్ని పురస్కరించుకుని అక్టోబర్‌లో జరిగిన బీజింగ్ ఈవెంట్‌లో తాలిబాన్ పాల్గొన్నారు. ప్రాంతీయంగా చైనా అనుసరిస్తున్న వ్యూహాన్ని ఇది సూచిస్తుంది. 2021లో ఆఫ్ఘనిస్తాన్ నుండి NATO వైదొలిగిన తర్వాత తాలిబాన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత తాలిబాన్ ప్రతినిధులు చేసిన అంతర్జాతీయ పర్యటనలు చాలా తక్కువ. అందులో ఇది కూడా ఒకటి. ఆఫ్ఘన్ తాత్కాలిక వాణిజ్య మంత్రి హాజీ నూరుద్దీన్ అజీజీ, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో పాల్గొనే ఆకాంక్షను ప్రకటించారు. ఇస్లామిస్ట్ తాలిబాన్, కమ్యూనిస్ట్ చైనా మధ్య ఈ కూటమి కాస్త విచిత్రంగా అనిపించినా చైనా పాలకుల్లో అంతర్గతంగా ఇస్లామీయ సంస్థలు, దేశాల పట్ల ఉన్న భయ సందేహాలు కూడా ఈ మైత్రి వెనుక ఉన్నాయని కొందరు విశ్లేషిస్తున్నారు. చైనాలో దేశీయంగా చైనా కమ్యునిస్టు పార్టీ మతం పట్ల భయపడినప్పటికీ, అంతర్జాతీయంగా ఇస్లామీయ దేశాలతో, సంస్థలతో సహకరిస్తూ పనిచేస్తోంది. ఆ విధంగా దేశంలో ముస్లిం సంస్థలకు విదేశీ సహాయసహకారాలు అందని వాతావరణాన్ని సృష్టిస్తోంది. మధ్య ఆసియా, పశ్చిమ సరిహద్దు ప్రాంతాలు, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌కు కీలకమైన ప్రాంతాలు. చైనా ప్రయోజనాలకు ముప్పు కలిగించే మిలిటెంటు సంస్థలను ఎదుర్కొనే ప్రమాదం ఇక్కడనే ఉంది. ఈ ప్రమాదాన్ని అరికట్టడానికి. చైనా ఒక విస్తృత ప్రణాళికతో తాలిబాన్‌తో జతకట్టింది. సోవియట్-ఆఫ్ఘన్ యుద్ధం తర్వాత చైనా ముజాహెద్దీన్‌కు మద్దతు ఇచ్చిందని గుర్తించాలి. చైనా ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఇలాంటి స్నేహాలు పొత్తులకు ఎల్లప్పుడు సిద్ధమే అన్నది గతంలోను రుజువయ్యింది. మరోవైపు వీగర్ ముస్లిములపై చైనా అంతర్గత అణచివేత, అమానుష దౌర్జన్యాలు చైనా అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలకు నిదర్శనం. అంతర్జాతీయంగా తాలిబాన్ తదితరులతో స్నేహ సంబంధాల ద్వారా దేశీయంగా వీగర్ ముస్లిములపై అణిచివేతలను కొనసాగించడానికి తగిన వాతావరణం ఏర్పరచుకుంటోంది.

## పాకిస్తాన్‌లో ఉగ్రవాద దాడి

నవంబర్ 4, 2023 ఉదయం, పంజాబ్‌లోని పాకిస్తాన్‌లోని మియాన్‌వాలి ఎయిర్‌బేస్‌పై ఉన్న నిర్మలమైన ఆకాశం ఉగ్రవాదుల దుర్మార్గపు చర్యలతో రక్తసిక్తమయ్యింది. ఉగ్రవాదులు అత్యంత బలమైన సైనికస్థావరంపై దాడి చేశారు. భారీ సంఖ్యలో సాయుధులు ఈ దాడి చేశారు. దాడి చేసింది తెహ్రీక్-ఎ-జిహాద్ పాకిస్తాన్‌గా గుర్తించారు. వైమానిక స్థావరంలోకి చొరబడటానికి సాయుధులు ప్రయత్నించారు. అత్యాధునిక ఆయుధాలతో ఈ దాడి చేశారు. తుపాకులు మాత్రమే కాదు విధ్వంసం సృష్టించే బాంబులతో దాడులు చేశారు. పాకిస్తాన్ వైమానిక దళం బలసామర్థ్యాలను నిర్వీర్యం చేయడానికే ఈ దాడి జరిగిందని పలువురు విశ్లేషిస్తున్నారు. పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన సైనికులు వేగంగా స్పందించారు. ఉగ్రవాదులను ఎదుర్కొన్నారు. వైమానిక స్థావరం తుపాకుల మోతతో దద్దరిల్లింది. విధి నిర్వహణలో ఉన్న సైనిక సిబ్బంది తక్షణం ప్రతిస్పందించడం వల్ల ఉగ్రవాదుల ప్రయత్నం విఫలమైంది. ఉగ్రవాదులు స్థావరంలో చొచ్చుకుపోయినట్లయితే పాకిస్తాన్ వైమానికదళానికి తీవ్రనష్టం భరించవలసి వచ్చేది. పాకిస్తాన్ ఎలాంటి ఉగ్రవాద సమస్యను ఎదుర్కుంటుందో ఈ సంఘటన చాటి చెబుతోంది. ఈ సంఘటన తీవ్రవాద ముప్పు తీవ్రతను చాటి చెబుతోంది. అంతేకాదు, సైనిక దళాల సంసిద్ధత, అప్రమత్తత ఎంత అవసరమో కూడా చాటి చెబుతోంది.


## ఐపియల్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న సౌదీ అరేబియా

సౌదీ అరేబియా తన క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి, క్రీడా రంగంలో అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని విస్తరించడానికి ఒక పెద్ద నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో భారీ వాటా పొందడానికి ఆసక్తి కనబరుస్తోంది. వివరాలు చూస్తే, IPLలో గణనీయమైన పెట్టుబడి పెట్టాలని సౌదీ అరేబియా ఆలోచిస్తోంది, 30 బిలియన్ల విలువ కలిగిన పెట్టుబడులతో ఐపియల్‌ను హోల్డింగ్ కంపెనీగా మార్చాలని యోచిస్తోంది. ప్రపంచ వేదికపై లీగ్ ఉనికిని విస్తరించడానికి 5 బిలియన్ల పెట్టుబడులు పెట్టి ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ లేదా యూరోపియన్ ఛాంపియన్స్ లీగ్ స్థాయికి తీసుకువెళ్ళాలని సౌదీ భావిస్తోంది. ఈ చర్య వల్ల సౌదీ అరేబియా క్రీడా రంగం మరింత బలోపేతం అవుతుంది. అందుకే ఐపీఎల్‌లో బహుళ-బిలియన్ డాలర్ల వాటాను కొనుగోలు చేసే ప్రయత్నాల్లో ఉందని బ్లూమ్ బర్గ్ నివేదిక తెలియజేస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా, సౌదీ అరేబియా అంతర్జాతీయంగా IPLను గ్లోబల్ స్పోర్టింగ్ లీగ్‌ల మాదిరి విస్తరించాలని చూస్తోంది. ఈ పెట్టుబడి ప్రతిపాదనకు సంబంధించి క్రౌన్ ప్రిన్స్ ముహమ్మద్ బిన్ సల్మాన్ సలహాదారులు భారత ప్రభుత్వ అధికారులతో చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. ఈ చర్యలు భారతదేశంలో ప్రొఫెషనల్ క్రీడలను గణనీయంగా ప్రభావితం చేయవచ్చు. ఫుట్‌బాల్, గోల్ఫ్‌తో సహా వివిధ క్రీడలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. సౌదీ-భారతీయ సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో జరుగుతున్న ప్రయత్నాల్లో ఇది భాగమే. సెప్టెంబర్ నెలలో క్రౌన్ ప్రిన్స్ ముహమ్మద్ బిన్ సల్మాన్ భారతదేశ పర్యటన సందర్భంగా ఈ పెట్టుబడికి సంబంధించిన చర్చలు ముఖ్యంగా జరిగాయి. సౌదీ అరేబియా చేస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రతిపాదన వల్ల IPL ప్రపంచంలో ఒక లాభదాయకమైన, ప్రభావవంతమైన క్రీడా సంస్థగా అంతర్జాతీయంగా మరింత ప్రతిష్ఠ సంపాదిస్తుంది.

# కేరళలో ఇస్లాం సంస్కృతిపై ప్రభుత్వ వెబ్ సైటు

**కేరళ** ప్రభుత్వం, ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో, రాష్ట్రంలో ఇస్లామిక్ సంస్కృతిని హైలైట్ చేయడానికి ఒక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. కేరళలో ఇస్లాం చరిత్ర చాలా పాతది. రాష్ట్రంలో ఇస్లామీయ సాంస్కృతిక వికాసాన్ని ప్రదర్శించే ఒక మైక్రోసైట్ తయారు చేయడానికి కేరళ టూరిజం 93.8 లక్షల రూపాయల మొత్తాన్ని కేటాయించింది. ఈ మైక్రోసైట్ పర్యాటకాన్ని ప్రోత్సహించే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ప్రారంభిస్తున్నారు. ఇది అంతర్జాతీయ, దేశీయ పర్యాటకులను ఇది ఆకర్షిస్తుందని భావిస్తున్నారు. కేరళలో 7వ శతాబ్దం నుంచి ఇస్లాం ఉనికిలో ఉంది. కేరళలో ఇస్లాం చరిత్రను ఈ మైక్రోసైట్‌లో ప్రదర్శిస్తారు. ఇందులో ఆరు వేర్వేరు విభాగాలుగా ప్రదర్శిస్తున్నారు. ప్రతి ఒక్క విభాగం ఇస్లామిక్ సంస్కృతిలోని ప్రత్యేక కోణాన్ని పరిచయం చేస్తుంది. కేరళ సామాజిక చక్రంలో ఇస్లాం ఎలా విడదీయరాని భాగమయ్యిందో వివరిస్తుంది. మొదటి విభాగంలో మలబార్ తీరం వెంబడి ప్రారంభ కాలం నాటి వ్యాపారులు, వారి స్థావరాల వివరాలతో కేరళలో ఇస్లాం ప్రవేశించిన చరిత్రను ప్రదర్శిస్తారు. తిరువనంతపురంలోని బీమపల్లి నుండి కాసరగోడ్‌లోని చారిత్రాత్మక జుమా మసీదు వరకు కేరళ అంతటా విస్తరించి ఉన్న ఇస్లామీయ ధార్మిక క్షేత్రాల ఆకర్షణీయమైన కథనాన్ని ఇందులో ప్రస్తావిస్తారు. వివిధ పురాతన మసీదులు ప్రముఖంగా ప్రదర్శించబడతాయి. వీటిలో కొడంగల్లూర్‌లోని చేరమాన్ జుమా మసీదు, మలప్పురంలోని జామా-అత్ మసీదు, కోజికోడ్‌లోని మిష్కాల్ మసీదు మొదలైనవి ఉన్నాయి. మైక్రోసైట్ కేరళలోని ముస్లింల వంటకాల ప్రత్యేకతలను కూడా వివరిస్తుంది. ప్రత్యేకంగా మాప్పిలా వంటకాలను ముఖ్యంగా ప్రదర్శిస్తారు. పర్షియన్, యెమెన్, అరబ్ ప్రభావాలతో కూడిన సాంప్రదాయ కేరళ రుచుల ప్రత్యేక సమ్మేళనం ఇది. జీవనశైలి విభాగంలో ముస్లిముల వస్త్రధారణ వారి ఆచారాల గురించి వివరణాత్మక కథనాలు న్నాయి. వివాహాలు, వివాహానికి ముందు ఆచారాలు, వివాహానంతర వేడుకలు పర్యాటకలను ముఖ్యంగా ఆకర్షిస్తాయని భావిస్తున్నారు. ఇంకా ఇస్లామిక్ వాస్తు కళకు సంబంధించిన విభాగంలో కేరళలోని స్వదేశీ నిర్మాణ సాంకేతికతలతో అరబిక్ నిర్మాణ సంప్రదాయాల సమ్మిళిత వాస్తుకళను ప్రదర్శిస్తారు, చివరి విభాగంలో కేరళలోని ముస్లిం సమాజానికి సంబంధించిన కళారూపాలు, పండుగలను చూపిస్తారు. 16వ శతాబ్దంలో కేరళలో జన్మించిన జానపద సంప్రదాయంపై మాప్పిలా పాటల ప్రభావంపై కూడా ప్రత్యేకమైన పరిశోధనాత్మక కథనాలు న్నాయి. కేరళ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం కేరళ సంస్కృతిలో గణనీయ పాత్ర పోషించిన ఇస్లాం మతానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒకే వేదికపై అందించే ప్రయత్నంగా భావించవచ్చు. ఇది పర్యాటకాన్ని ప్రోత్సహించడమే కాకుండా కేరళకు మత పండితులు, చరిత్రకారులు, విద్యార్థులు, యాత్రికులను ఆకర్షిస్తుంది. కేరళలో ఇస్లాం వారసత్వం గురించి వారి అవగాహనను సుసంపన్నం చేస్తుంది.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**